సత్యదేవా.. అసత్యం కనవా!

- నకిలీ రశీదులతో పీఎఫ్ కాజేసేందుకు ఏజెన్సీ కుట్ర
- ఆలయంలో 350 మంది పారిశుధ్య కార్మికులు
- వెనకుండి నడిపించిన దేవస్థాన అధికారి
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన.. 7

21న గురుకుల పాఠశాలల్లో మిగులు సీట్లు భర్తీ: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), జూలై 17(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని సాంఘికసంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదోతరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మిగులు సీట్ల భర్తీకి ఈనెల 21న ఉదయం 10గంటల నుంచి కాకినాడ సాంబమూర్తినగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు.

పాఠశాలలవారీ మిగులు సీట్ల వివరాలు

పి.వెంకటాపురం: టెన్త్(3), జూనియర్ ఇంటర్(8), సీనియర్ ఇంటర్ 16 సీట్లు

ఎ.మల్లవరం: 5వతరగతి(18), పదో తరగతి(9), సీనియర్ ఇంటర్(44)

ఎస్ఎంనగర్: 5వతరగతి(29), పదో తరగతి(2), సీనియర్ ఇంటర్(14)

ఏలేశ్వరం: 5వతరగతి(28), 10వ తరగతి(2), సీనియర్ ఇంటర్(17)

వి.కొత్తూరు: 5వతరగతి(3), జూనియర్ ఇంటర్(17),సీనియర్ ఇంటర్(35)

జగ్గంపేట: 5వతరగతి(36), టెన్త్(13), సీనియర్ ఇంటర్ 19 సీట్లు

చొల్లంగిపేట: 5వతరగతి(60), 6వతరగతి(3), 9వతరగతి(1), టెన్త్(14), జూనియర్ఇంటర్(37), సీనియర్ ఇంటర్(39)

తుని బాలురు: 5వతరగతి(4),టెన్త్(4)

పిఠాపురం: 5వతరగతి(9), టెన్త్(3), సీనియర్ ఇంటర్ 13 సీట్లు

ఈవిద్యాసంవత్సరం నుంచి టెన్త్, ఇంటర్మీడియట్ రెండోఏడాది మిగులు సీట్లు భర్తీచేస్తామన్నారు. పదో తరగతిలో చేరేందుకు 9వతరగతి ఫైనల్ మార్కుల షీటు, స్టడీ సర్టిఫికెట్ అవసరమన్నారు.

ఎత్తిపోస్తారు!

ప్రైవేటుకు ఎత్తిపోతల



- ఉమ్మడి జిల్లాలో 48 పథకాలు
- కార్పొరేట్‌కు నిర్వహణ బాధ్యత
- రూ.600 కోట్లతో ప్రతిపాదన
- వైసీపీ హయాంలో తీవ్ర నిర్లక్ష్యం
- ఏజెన్సీలో 50 పథకాల మూత
- కూటమి ప్రభుత్వం దృష్టి
- కొత్త పద్ధతికి శ్రీకారం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

నిర్వీర్యమైన చిన్న నీటిపారుదల వ్యవస్థను బతికించడానికి తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు ఆరంభించింది. ఓ ప్రైవేట్ కార్పొరేట్ సంస్థకు మరమ్మతులు, నిర్వహణ బాధ్యత అప్పగించనుంది. ఉభయగోదావరి జిల్లాల్లో మెట్ట ప్రాంతంలోని 48 ఎత్తిపోతల పథకాల మరమ్మతులు, నిర్వహణకు రూ.600 కోట్లతో అధికారులు అంచనాలు సిద్ధంచేశారు. గత వైసీపీ హయాంలో చిన్న నీటిపారుదల వ్యవస్థ పూర్తిగా అవస్థలకు గురైంది. ఇప్పటికే ఏజెన్సీలో 70 ఎత్తిపోతల పథకాలు మూతపడ్డాయి. దీంతో వాటిని వదిలేశారు. కాలువల ద్వారా నీటి సరఫరా లేని మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో సాగునీరు సరఫరా చేయడానికి 1974లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల సంస్థ ఏర్పడింది. కనీసం 50 నుంచి 5 వేల ఎకరాల వరకూ ఉన్న భూములకు ప్రభుత్వం ఒక్కొక్క ఎత్తిపోతల పథకం నిర్మించి రైతులకు అప్పగించేది. వాటికి ఉచిత కరెంట్ ఇచ్చేది. వాటి నిర్వహణ రైతులు చేసుకోవాలి. దీని కోసం 11 మంది సభ్యులతో కూడిన రైతు కమిటీ ఉండేది. రైతుల నుంచి ఎకరాకు రూ.500 నుంచి రూ.1000 వరకూ ఏడాదికి వసూలు చేసి ఎత్తిపోతల పథకాలు నిర్వహణ చూసేవారు. ఇలా చాలా కాలం నడిచిన పథకాలను వైసీపీ పూర్తిగా నిర్వీర్యం చేసింది. దీంతో చాలాచోట్ల రైతులు వదిలేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 101 ఎత్తిపోతల పథకాలు ఉండేవి. 37,450 ఎకరాల ఆయకట్టు ఉండేది. పోలవరం ప్రాజెక్టు ముంపు కారణంగా ఏజెన్సీ ప్రాంతాల్లో 50 ఎత్తిపోతల పథకాలను పనిచేయడంలేదు. మరో 20 పథకాలు నిర్వీర్యమయ్యాయి. ప్రస్తుతం ఉభయగోదావరి జిల్లాల పరిధిలో ఉన్న 48 ఎత్తిపోతల పథకాలను రైతుల నుంచి తప్పించి కార్పొరేట్ సంస్థకు ఇచ్చి వ్యవస్థను మెరుగుపరచడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 28 పథకాలు..

- తూర్పుగోదావరి జిల్లాలో 10 పథకాలు పాక్షికంగా పనిచేస్తున్నాయి. కొవ్వూరు నియోజకవర్గంలో కుమారదేవం, బ్రాహ్మణగూడెం, చాగల్లు, వేగేశ్వరపురం, పైడిమెట్ట-1, నిడదవోలు, అనపర్తిలో పి.బి.దేవం-1,2, కాపవరం,సీతానగరం మండలం కాటవరం ఉన్నాయి.23,745 ఎకరాల ఆయకట్టు ఉంది. మరమ్మతులు,నిర్వహణకు రూ.195 కోట్ల 60 లక్షలతో అంచనాలు పంపించారు.
- అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 4 పథకాలున్నాయి. రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లో చింతలమోరి, వసంతవాడ ఉన్నాయి. మొత్తం 4,970 ఎకరాల ఆయకట్టు ఉంది. మరమ్మతులు, నిర్వహణకు రూ.34 కోట్ల 8 లక్షల 37వేలతో అంచనాలు సిద్ధంచేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలో పల్లిపాలెం-1,2 పథకాలున్నాయి. 927 ఎకరాల ఆయకట్టు ఉంది. మరమ్మతులు, నిర్వహణకు రూ.3.48 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు.
- కాకినాడ జిల్లాలో 14 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. పెద్దాపురం నియోజకవర్గంలోని వేట్లపాలెం, కట్టమూరు, కట్టమూరుమినీ, పెద్దాపురం-1,2, జి.మేడపాడు, పెదబ్రహ్మదేవం-3, కాకినాడ రూరల్‌లో వేములవాడ-2, పెద్దాపురపాడు, గొర్రిపూడి, వేములవాడ- అనపర్తి నియోజకవర్గం పరిధి పెదపూడి, దోమాడ, జగ్గంపేట నియోజకవర్గంలో సోమవరం పథకాలున్నాయి. 13,710 ఎకరాల ఆయకట్టు ఉంది. మరమ్మతులు, నిర్వహణకు రూ.122కోట్ల 25లక్షల 32వేలు అంచనా వేశారు.



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో కాకినాడ బెస్ట్

- జాతీయస్థాయిలో 38వ ర్యాంక్.. రాష్ట్రంలో ఐదో ర్యాంక్



కార్పొరేషన్(కాకినాడ), జూలై 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో కాకినాడ మంచి ర్యాంకుతో బెస్ట్‌గా నిలిచింది. ఏటా కేంద్ర గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ దేశవ్యాప్తంగా వివిధ ప్రమాణాల మేరకు వీటిని ఇస్తోంది. జనాభా ప్రాతిపదికన సూపర్ స్వచ్ఛ లీగ్ అవార్డుల కేటగిరీలో భాగంగా 3లక్షలనుంచి 10 లక్షలలోపు కేటగిరీలో కాకినాడ నగరపాలక సంస్థ ఎంపికైంది. 2024-25 స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో జాతీయస్థాయిలో 38వ ర్యాంక్, రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంక్‌తో మెరిసింది. గతంలో 2023-24 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయస్థాయిలో 178వ ర్యాంక్, రాష్ట్రస్థాయిలో 10వ ర్యాంక్‌తో పోలిస్తే ఈ ఏడాది చాలా మెరుగైన ర్యాంకు సాధించింది. మున్సిపల్ కార్పొరేషన్ కనబరిచిన ప్రతిభకు కార్పొరేషన్ అధికారులను, పారిశుధ్య కార్మికులను, పౌరులకు కలెక్టర్ షాన్‌మోహన్ అభినందనలు తెలిపారు. ఈ ర్యాంకులు మన ప్రజల సమష్టి కృషి ద్వారా బలోపేతం చేసిన స్వచ్ఛఆంధ్ర-స్వర్ణఆంధ్ర మిషన్ ప్రభావాన్ని మరింత ప్రత్యేకంగా చూపిస్తాయని కమిషనర్ భావన అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రపంచంలోనే అతిపెద్ద పరిశుభ్రత సర్వే కాగా, స్వచ్ఛ భారత్ మిషన్‌లో దేశ పౌరులను భాగస్వామ్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2016లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. స్వచ్ఛత, ఆదర్శ పట్టణాల రూపకల్పనే ధ్యేయంగా కృషిచేస్తోంది. ఇందులో భాగంగా స్వచ్ఛతకు ప్రాధాన్యం, పరిశుభ్రమైన పట్టణాలుగా తీర్చిదిద్దడం కోసం మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌ల మధ్య స్వచ్ఛ సర్వేక్షణ్ పేరిట పోటీలను నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించి మార్కులు కేటాయిస్తారు. వీటి ఆధారంగా ఓడీఎఫ్, ఓడీఎఫ్ ప్లస్ ర్యాంకులు ప్రకటిస్తారు. ఇందుకోసం పురపాలికల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేపడతారు.

ప్రధాన అంశాలు: నిత్యం చెత్త సేకరణ, తడి, చెత్త పొడి చెత్త, నిర్వహణ, జన సంచార ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ, మురుగు కాల్వలు, ప్రజా మరుగుదొడ్లు, శుభ్రత పరిసరాల పరిశుభ్రత వంటి అంశాల్లో మున్సిపాలిటీలకు కార్పొరేషన్లకు ఈ ర్యాంకులు కేటాయిస్తారు.

మత్తు పదార్థాలవల్ల కలిగే అనర్థాలపై చైతన్యం కల్పించాలి

- జిల్లాలో అన్ని పాఠశాలల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలి
- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ),జూలై17(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలవల్ల కలిగే అనర్థాలపై విద్యార్థుల్లో అవగాహన, చైతన్యం కల్పించేలా జిల్లాలో అన్నిపాఠాశాలల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో గురువారం ప్రతి పాఠశాలలో ఈగల్‌క్లబ్ ఏర్పాటుపై కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్ కలిసి ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాలు, గంజాయి వంటి వాడకం, అమ్మకం, రవాణాను అరికట్టేందుకు ఈగల్ టీమ్ అనే కొత్త వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. ఈగల్ టీమ్ మత్తు పదార్థాలు వినియోగించే వారిపై ప్రత్యేక దృష్టిపెడుతుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంచే చర్యల్లో భాగంగా ప్రతిపాఠశాల, కళాశాలలో ఈగల్ క్లబ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఈగల్‌క్లబ్‌లో ప్రతి పాఠశాలలో 8మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలన్నారు. జిల్లాలో డ్రగ్స్, మత్తు పదార్థాలపై మిషన్ మోడ్‌లో ప్రతిపాఠశాల, కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 30 నాటికి జిల్లాలో అన్ని పాఠశాలల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ మత్తుపదార్థాల వాడకం,అమ్మకం రవాణా వంటి కేసుల్లో నిందితులపట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. మాదకద్రవ్యాల సమాచారం ఉంటే ఎవరైనా టోల్‌ఫ్రీ నెంబర్ 1972కి ఫోన్ చేసి ఇవ్వాలన్నారు. పాఠశాలలో విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పించడంతోపాటు మత్తు పదార్థాలకు ఆకర్షితులు కాకుండా ఉంచేలా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి రమేష్, ఎస్ఎస్ఏ పీవో వేణుగోపాల్‌రావు, ఈగల్ టీమ్ అధికారి ధర్మతేజ తదితరులు పాల్గొన్నారు.

'ఉల్లాస్ అక్షరాంధ్ర'లో అధికారులు భాగస్వాములవ్వాలి

జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ),జూలై17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఉల్లాస్.. అక్షరాంధ్ర.. అక్షరాస్యత కార్యక్రమంలో అధికారులంతా భాగస్వామ్యం అవ్వాలని కలెక్టర్ షాన్‌మోహన్ పిలుపునిచ్చారు. కాకినాడ కలెక్టరేట్ కార్యాలయంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి సంబంధించి అక్షరాంధ్ర..అక్షరాస్యత కార్యక్రమానికి సంబంధించిన జిల్లాస్థాయి అధికారులతో సమన్వయ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 2023లో నిర్వహించిన క్యాస్ట్ సర్వే ద్వారా 3,39,963మంది వయోజనులైన నిరక్షరాశ్యులను జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల శాఖల ద్వారా గుర్తించామన్నారు. జిల్లాలో మొదటి విడతగా 2025-26 సంవత్సరంలో 1,03,081మంది వయోజనులైన నిరక్షరాశ్యులను తీసుకుని వారందరినీ అక్షరాస్యులుగా చేయడానికి సంబంధితశాఖల ద్వారా యాక్షన్ ప్లాన్ తయారుచేయాలన్నారు. రాష్ట్రప్రభుత్వం ఆదేశించినట్లు తదుపరి మూడేళ్లలో మొత్తం 3,39,963 మంది నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా చేసి కాకినాడ జిల్లాని అక్షరాస్యతలో మొదటి స్థానంలోని తీసుకురావాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అనంతరం జిల్లా వయోజన విద్య నోడల్ అధికారి వెంకట్రావురెడ్డి మాట్లాడుతూ 2024-25 సంవత్సరంలో ఉల్లాస్ అక్షరాస్య కార్యక్రమం 27 మండలాల్లో నిరక్షరాశ్యులైన డ్వాక్రా గ్రూపు మహిళలని 6,806మందిని గుర్తించి వారిని అక్షరాస్యులుగా తయారు చేశామన్నారు. ఈనెల25వరకు మండలాల్లో వాలంటరీ టీచర్స్‌ని గుర్తించి వారికి మ్యాచింగ్, బ్యాచింగ్ ద్వారా పదిమందికి ఒక వాలంటరీ టీచర్‌ని ఏర్పాటు చేస్తారన్నారు. ఈనెల 25 నుంచి 28వరకు జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈనెల 29 నుంచి ఆగస్టు 6 వరకు మండలస్థాయిలో వాలంటరీ టీచర్స్‌కి, రిసోర్స్ పర్సన్స్‌కి శిక్షణ కార్యక్రమాలు ఎంపీడీవో ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, మెప్మా పీడీ ప్రియంవద, డ్వామా పీడీ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటికల ప్రదర్శన

- అల్లూరి సీతారామరాజు కళాపరిషత్ రజతోత్సవ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు



27వ మైలురాయి నాటికలో ఒక సన్నివేశ దృశ్యం

కార్పొరేషన్(కాకినాడ), జూలై 17(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు నాటక కళాపరిషత్ రంగస్థల కళారంగానికి 25ఏళ్లగా అందిస్తున్న సేవలు అద్వితీయమని వక్తలు అన్నారు. కళాపరిషత్ రజతోత్సవ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు గురువారం సాయంత్రం సూర్యకళామందిరంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. పి.చిరంజీవినికుమారి స్మారక కళాప్రాంగణంలో జ్యోతిని వెలిగించి కార్యక్రమం ప్రారంభించారు. కళాపరిషత్ అధ్యక్షుడు కర్రి అచ్యుత రామారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అతిథులుగా ప్రముఖ వ్యాపారవేత్త మట్టే సత్యప్రసాద్, మాజీమంత్రి చిక్కాల రామచంద్రరావు, క్షత్రియ పరిషత్ అధ్యక్షుడు అడ్డూరి రామకృష్ణ, కాకినాడ సీపోర్టు లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మెర్ల మురళీధర్, వాడ్రేవు సుందరరావు, బుర్రా పద్మనాభం, సీఎస్ మూర్తి, డాక్టర్ స్టాలిన్, జోగి జగన్నాథరాజు హాజరై 25ఏళ్లుగా నిర్విరామంగా పరిషత్‌లు నిర్వహిస్తూ రంగస్థల కళకు కొత్త శోభ తీసుకురావడంతో సీతారామరాజు కళాపరిషత్ సేవలను కొనియాడారు. ఎందరో నటీనటులు, సాంకేతిక నిపుణులకు పుట్టినిల్లుగా సంస్థ ఉందన్నారు. సీతారామరాజు కళావేదిక గౌరవాధ్యక్షుడు కర్రి భామిరెడ్డికి అల్లూరి సీతారామరాజు కళావేదిక గౌరవాధ్యక్షుడు కర్రి భామిరెడ్డికి అల్లూరి సీతారామరాజు విశిష్ట సాంస్కృతిక సేవా పురస్కారం 2025ను అతిథులు అందజేసి సత్కరించారు. అనంతరం చిన్నారులు జైవీరకృష్ణ అల్లూరి సీతారామరాజుగా, సహస్ర ఐలవాయునాన్న ఏకపాత్రాభినయాలతో ఆకట్టుకున్నారు. రాష్ట్రస్థాయి నాటికల పోటీల్లో భాగంగా తొలిరోజు మొదటి ప్రదర్శనగా యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ విజయవాడ వారి 27 మైలురాయి నాటికను ప్రదర్శించారు. దీని రచన పీటీ మాధవ్, దర్శకత్వం ఆర్.వాసు. న్యాయవ్యవస్థలోని జరుగుతున్న లోపాలను తెలియజేస్తూ ఆకట్టుకునేలా ప్రదర్శన సాగింది. అనంతరం శ్రీసాయి ఆర్ట్స్ కొలుకలూరి వారి జనరల్ బోగీలు నాటిక ప్రదర్శన సాగింది. రచన మాధవ్, దర్శకత్వం గోరరాజు విజయ్. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న విభిన్న అంశాల కథనంతో సాగిన నాటిక ప్రదర్శన అలరింపచేసింది. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి పంపన దయానందబాబు, ఎసీవీవీఎస్ఎన్ మూర్తి, బాలప్రకాష్, రెడ్డి, లక్ష్మీనారాయణ, పేరయ్యశాస్త్రి, రామసత్యనారాయణ, కెర్ల పుల్లారావు, మార్ని జానకిరామ్ చౌదరి పాల్గొన్నారు.

బదిలీ ఉత్తర్వులు అమలు చేయాల్సిందే

- మునిసిపల్ ఏడీ ఆదేశం
- అమలు చేయని పిఠాపురం మున్సిపల్ కమిషనర్‌కు మెమో

పిఠాపురం,జూలై17(ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారులు జారీచేసిన ఉద్యోగుల బదిలీ ఉత్తర్వులను అమలుచేయకుండా నిర్లక్ష్యం ప్రదర్శించిన పిఠాపురం, గొల్లప్రోలు మునిసిపల్ కమిషనర్ కనకారావుకు మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ కమ్ డైరెక్టర్ మెమో జారీ చేశారు. క్రమశిక్షణా చర్యలు ఎందుకు తీసుకోకూడదో మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని, తక్షణం బదిలీ ఉత్తర్వులు అమలు చేయాలని ఆదేశించారు.

సాధారణబదిలీల్లో భాగంగా పిఠాపురం పురపాలక సంఘం, గొల్లప్రోలు నగర పంచాయతీల్లో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులను బదిలీ చేయగా వివిధ మునిసిపాలిటీల నుంచి ఇక్కడకు 14మంది ఉద్యోగులను బదిలీపై నియమిస్తూ గతనెలలో రాజమహేంద్రవరం పురపరిపాలనశాఖ రీజనల్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ఇందులో ఐదేళ్లసర్వీసు పూర్తిచేసుకున్న 8మంది ఉద్యోగులు ఉన్నారు. బదిలీ అయిన ఉద్యోగులను రిలీవ్ చేయకపోగా కొత్తగా వచ్చిన వారిని ఇప్పటివరకూ విధుల్లోకి చేర్చుకోలేదు. పిఠాపురం, గొల్లప్రోలుకు బదిలీపై వచ్చిన వారు ఇప్పటికే వారు పనిచేస్తున్న మునిసిపాలిటీల్లో రిలీవ్ కావడంతో జీతాల సమస్య ఏర్పడింది. పిఠాపురం, గొల్లప్రోలు కమిషనరుగా ఉన్న కనకారావు తన ఆదేశాలు అమలు చేయని విషయాన్ని మునిసిపల్ ఆర్డీ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌కు నివేదించారు. దీంతో తక్షణం బదిలీ ఉత్తర్వులు అమలు చేయాలని సీడీఎంఏ ఆదేశాలు జారీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలు అమలు చేయని అంశంలో క్రమశిక్షణా చర్యలు ఎందుకు తీసుకోకూడదో మూడురోజుల్లో వివరణ ఇవ్వాలని కమిషనరును ఆదేశించారు. పిఠాపురం, గొల్లప్రోలుల్లో మునిసిపల్ ఉద్యోగుల బదిలీల విషయంలో కలెక్టర్ సూచనలకు అనుగుణంగా వ్యవహరించినట్లు కమిషనరు చెబుతున్నారు. గురువారం రాత్రి వరకూ ఉద్యోగులను రిలీవ్ చేయకపోగా కొత్తవారిని చేర్చుకోలేదు.

ఖరీఫ్ వరిసాగుకు సమృద్ధిగా ఎరువుల నిల్వలు

- జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్

సామర్లకోట, జూలై 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ వరిసాగుకు పంటకాలంలో అవసరమయ్యే ఎరువులన్నింటినీ సిద్ధం చేశామని ఇప్పటి వరకూ 18,000మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా చేశామని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్ వెల్లడించారు. గురువారం సామర్లకోట మండలంలోని జీ.మేడపాడు, పెదబ్రహ్మదేవం పీఏసీఎస్ గొడాములను వ్యవసాయాధికారులతో కలిసి డీఏవో విజయకుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు 48వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా గురువారం సాయంత్రం నాటికి 18వేల మెట్రిక్‌టన్నులు రైతులు వినియోగించుకోగా ఇంకా 21,450 మెట్రిక్‌టన్నుల ఎరువులను జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో సిద్ధంగా ఉంచామన్నారు. వీటిలో 10,140 మెట్రిక్‌టన్నుల మేర యూరియా ఎరువులు, 450 మెట్రిక్‌టన్నుల డీఏపీ ఎరువులు, 3000 మెట్రిక్‌టన్నుల కాంప్లెక్స్ ఎరువులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఇప్పటికే అవసరమయ్యే ఎరువుల రాక కోసం ఇండెంట్‌లు పెట్టినందున ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో సకాలంలోనే ఎరువులు జిల్లాకు చేరుకోగలవన్నారు. జిల్లాలో గురువారం నాటికి 15వేల హెక్టార్లలో వరినాట్లు పూర్తయ్యాయన్నారు. జి.మేడపాడు పీఏసీఎస్ గోదాములో ఎరువుల నిల్వలను డీఏవో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట జి.మేడపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు పాలకుర్తి వీరభవన్నారాయణ(రవిబాబు), జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజరు మంజుల, కాకినాడ ఏడీఏ దుర్గాలక్ష్మి పాల్గొన్నారు.

అమృత్ పథకంలో ఆరు స్టేషన్ల అభివృద్ధి

- బడ్జెట్ కేటాయింపుపై రైల్వే నోట్

రాజమహేంద్రవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): రైల్వేశాఖ బడ్జెట్‌లో రాష్ట్రానికి 2025-26కు సంబంధించి కేటాయింపులపై గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. దానిలోనూ రాజమహేంద్రవరానికి సంబంధించి పాత కూతే వినిపించింది. స్టేషను రీడెవలప్‌మెంట్‌కి రూ.271.43 కోట్లు కేటాయించామని పేర్కొంది. రెండేళ్లలో రానున్న పుష్కరాల నాటికి పనులు పూర్తి కావాలని ప్రజాప్రతినిధులు పదే పదే విన్నవిస్తున్నా పనులు ఇంకా టెండరు ప్రిపరేషన్ దశలోనే ఉన్నాయని ఆ ప్రకటనలో పేర్కొనడం గమనార్హం. అంటే ఇంకా టెండరు కూడా పిలవలేదు. ఆ ప్రక్రియ పూర్తి కావడానికి ఇంకా ఎన్నాళ్లు పడుతుందో స్పష్టత లేదు. రైల్వే రీడవలప్‌మెంట్ పనులకు నిధులిచ్చినా పనులు మొదలు పెట్టడంలో కాలయాపనపై ఇటీవలే 'ఆంధ్రజ్యోతి' కథనం వెలువరించడం తెలిసిందే. మరోవైపు అనపర్తి, నిడదవోలు జంక్షన్, రాజమహేంద్రవరం, కాకినాడ టౌన్, సామర్లకోట, తుని రైల్వేస్టేషన్లను అమృత్ పథకం కింద అభివృద్ధి చేస్తున్నారు.

కత్తిపూడిలో భారీగా ఆయిల్ పట్టివేత

శంఖవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): కత్తిపూడి శివార్లలో అక్రమంగా దిగుమతి చేస్తున్న అక్రమ ఆయిల్‌ను పోలీసులు పట్టుకున్నారు. 16వేల లీటర్లు ఉన్న ట్యాంకర్లతో ఆయిల్‌ను దిగుమతి చేస్తుండగా ఆకస్మికంగా దాడులు చేసి ట్యాంకర్‌తోపాటు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఆయిల్ ఏంటనేది పూర్తిస్థాయిలో స్పష్టత రావాల్సి ఉందని అన్నవరం పోలీసులు తెలిపారు. సివిల్ సప్లై అధికారులు పూర్తిస్థాయిలో స్పష్టత ఇచ్చిన తర్వాత దీనిపై ముందుకు వెళ్తామన్నారు. డీజిల్, పెట్రోలు, నాఫ్తాయిల్, ఎల్‌డీవో వంటివి హైవే వెంబడి అక్రమ వ్యాపారంగా సాగుతోంది.

ప్రముఖుల పరిశోధనలు

సమాజానికి ఎంతో దోహదం

- ఎన్‌బీఏ, న్యాక్ చైర్మన్ అనిల్ సహస్ర బుద్దే
- రోల్ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీపై జేఎన్టీయూకేలో వర్క్‌షాప్ 6

పొలాలకు చేరుతున్న సాగునీరు

- వరి సాగుకు ఉపక్రమిస్తున్న రైతులు
- ఏలేరు కాలువలకు 1500 క్యూసెక్కుల విడుదల
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



పిఠాపురం-గొల్లప్రోలు మధ్య గల ఏలేరు కాలువలో ప్రవహిస్తున్న నీరు

పిఠాపురం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఏలేరు నీరు పంటపొలాలకు చేరడం ప్రారంభమైంది. రైతులు వరి సాగుకు ఉపక్రమిస్తున్నారు. కాలువల చెంతన, ఇంజన్లు ఉన్న వారు ఇప్పటికే పొలాలు దమ్ము చేయడం పూర్తి చేశారు. ఏలేరు, పీబీసీ కాలువల ద్వారా నీరు పంటపొలాలకు చేరకపోవడంతో భూములు ఖాళీగా ఉన్నాయని, ఎగువ ప్రాంతాల్లో పూడికలు తీయకపోవడంతో పిఠాపురం ప్రాంతానికి నీరు రావడం లేదని వివరిస్తూ 'నీరు లేదు.. సాగు లేదు' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వార్తా కథనం ప్రచురితమైంది. దీనికి జిల్లా కలెక్టర్‌తోపాటు ఇరిగేషన్ ఉన్నతాధికారులు స్పందించారు. ఎగువ ప్రాంతాల్లో గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపట్టారు. పలు చోట్ల గుర్రపుడెక్క ఇంకా అలాగే ఉన్నా ఏలేరు రిజర్వాయర్ నుంచి విడుదలైన 1500 క్యూసెక్కుల నీటిలో కొంత భాగం పిఠాపురం ఆయకట్టుకు చేరడం ప్రారంభమైంది. ఇప్పటికే సాగు ఆలస్యం కావడంతో అన్ని ప్రాంతాల్లో ఒకేసారి నారుమడులు, ఇతర ప్రాంతాలు నుంచి నారు తెచ్చి నాట్లు వేసేందుకు సిద్ధమవ్వడంతో నీరు సరిపోని పరిస్థితి నెలకొంది, గోదావరి జలాలు పీబీసీ ఆయకట్టుకు చేరుతున్నారు. శివారు ప్రాంతాలకు అందాల్సి ఉంది. ఏలేరు నీరు విడుదల కావడంతో పిఠాపురం, గొల్లప్రోలు ప్రాంతాల్లో రైతులు పొలాలను దమ్ము చేయడం ప్రారంభించారు. కాలువల చెంతనే పొలాలు ఉన్న వారు ఇంజన్ల సహాయంతో నీటిని తోడి పొలాలకు మళ్లించుకుంటున్నారు. వీరిలో కొందరు నారుమడులు వేసేందుకు సన్నద్ధమవుతుండగా, మరికొన్ని ప్రాంతాల్లో వెదజల్లు పద్ధతిలో సాగుకు, ఇతర ప్రాంతాల నారు తెచ్చుకుని నేరుగా నాట్లు వేసుకునే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. మరోవైపు ఏలేరు, పీబీసీ కాలువల్లో సాగునీటి సరఫరా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు తెలిపారు. కాగా సాగునీరు తమ అవసరాలకు సరిపోవడం లేదని, ఏలేరు ద్వారా 2వేల క్యూసెక్కులు, పీబీసీ ద్వారా కనీసం వేయి క్యూసెక్కుల నీరు విడుదల చేసి శివారు ప్రాంతాల వరకూ చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

డ్రోన్ల వ్యవ'సాయం'


రైతులకు 80 శాతం రాయితీతో అందిస్తున్న డ్రోన్లు



- రైతులకు 80 శాతం రాయితీపై డ్రోన్లు
- సేద్యపు వ్యయంలో ఊరట
- కూలీల కొరతకూ పరిష్కారం
- జిల్లాల యూనిట్‌గా కేటాయింపులు
- సాగులో యాంత్రీకరణ దిశగా ప్రోత్సాహం
- సేద్యంలో కష్టాలను అధిగమించనున్నరైతులు

(ముమ్మిడివరం-ఆంధ్రజ్యోతి)

వ్యవసాయ సేద్యంలో డ్రోన్లు అందుబాటులోకి రావడంతో రైతులకు సాగులో ప్రోత్సాహం లభించనుంది. కూలీల కొరత.. రోజురోజుకు సేద్యపు వ్యయం పెరగడంతో రైతులు వరిసాగులో గిట్టుబాటు కరువవుతోంది. పురుగుమందుల పిచికారీ, నాట్లు వేయడానికి, కోతలకు సకాలంలో కూలీలు లభించకపోవడంతో రైతులకు సేద్యపు కష్టాలు పెరిగిపోతున్నాయి. వీటిని అధిగమించేందుకు వ్యవసాయశాఖ యాంత్రికీకరణను ప్రోత్సహిస్తోంది. గతంలో టీడీపీ హయాంలో రాయితీపై యంత్ర పరికరాలను అందించేవారు. ఇవికాక ప్రైవేటు భాగస్వామ్యంతో కస్టమ్ హైరింగ్ సెంటర్లు(సీహెచ్‌సీ) ఏర్పాటుచేసి రైతులకు అద్దె ప్రాతిపదికన యంత్రాలు అందించేవారు. 2018లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 20 కేంద్రాలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంగా నిర్ణయించగా కేవలం ఆరుచోట్ల మాత్రమే ఏర్పాటుచేసినా ప్రభుత్వం నుంచి రాయితీ సకాలంలో అందక వాటి నిర్వహణ కష్టం కావడంతో వాటిని మూసివేశారు. వైసీపీ పాలనలో రాయితీపై యంత్రాల సరఫరా పథకం అమలుచేసిన దాఖలాలే లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను యాంత్రికీకరణ వైపు ప్రోత్సహించేందుకు తాజాగా రైతు గ్రూపులకు పురుగుమందులు నానో (ద్రవరూప ఎరువులు) పిచికారీ చేసేందుకు 80 శాతం రాయితీపై డ్రోన్లను సరఫరా పెద్దఎత్తున చేపట్టింది.

యూనిట్ ధర ఎంతంటే...

డ్రోన్ యూనిట్ ధర రూ.9 లక్షల 80 వేలు కాగా 80 శాతం ప్రభుత్వ రాయితీపై అందిస్తున్నారు. గతంలో రూ.4 లక్షల 90వేలు బ్యాంకు రుణం ఇస్తుండగా రూ.4 లక్షల 90వేలు ముందుగా కట్టాల్సి ఉండేది. అనంతరం ప్రభుత్వ రాయితీ రూ.7లక్షల 84వేలు తిరిగి బ్యాంకులో రైతు ఖాతాకు జమయ్యేది. రైతులు అంత మొత్తం కట్టలేకపోవడంతో కొంత వెసులుబాటు కల్పించారు. రైతులు రూ.2 లక్షలు ముందుగా బ్యాంకులో చెల్లిస్తే రూ.7లక్షల 84వేలు రాయితీని ప్రభుత్వం 15 రోజుల వ్యవధిలో బ్యాంకులోని రైతు ఖాతాకు ప్రభుత్వం జమ చేస్తోంది.

అర్హతలు ఏంటంటే..

అన్ని సామాజిక వర్గాలను కలుపుకుని ఐదుగురు సభ్యులతో కిసాన్ డ్రోన్ రైతు మిత్ర గ్రూపు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. గ్రూపులో కన్వీనర్, కోకన్వీనర్, మరో ముగ్గురు సభ్యులు ఉండగా, కన్వీనర్, కోకన్వీనర్‌లు కనీస విద్యావంతులై ఉండాలి. రైతులు ఒక గ్రూపుగా ఏర్పాటైన తర్వాత బ్యాంకులో ఆధార్, పాన్‌కార్డు, ఫోన్ నెంబరు లింకేజీ బ్యాంకుకు అందించి సిబిల్ రేటింగ్ అర్హత పొందాలి. బ్యాంకు అనుమతి పొందిన వారికే డ్రోన్ మంజూరవుతుంది. గ్రూపుగా ఏర్పాటైన రైతులు తప్పనిసరిగా సొంత భూమి కలిగి ఉండాలి. డ్రోన్ ఆపరేటింగ్‌కు సంబంధించి రైతు మిత్ర కేసుల్లో సభ్యులుగానీ లేదా ఆ గ్రూపు వారు గ్రామంలో ఎవరినైనా ఎంపిక చేసిన వ్యక్తి కనీసం పదో తరగతి లేదా ఐటీఐ వంటి విద్యార్హత కలిగి ఉండాలి. డ్రోన్ నిర్వహణ, ఆపరేటింగ్ విషయాలపై 12రోజులపాటు ఆ వ్యక్తికి ఉచితంగా శిక్షణ ఇస్తారు. గుంటూరు, తాడేపల్లి, ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శిక్షణ సెంటర్లు ఉన్నాయి.

డ్రోన్ అద్దెకు కూడా..



డ్రోన్ పది లీటర్ల సామర్థ్యం కలిగి ఉంటుంది. పురుగుమందు ద్రావణాన్నిగానీ, నానో ఎరువులు ద్రవరూప ఎరువును గానీ పిచికారీ చేసుకోవచ్చు. ఎకరానికి డ్రోన్‌తో పిచికారీ చేయడానికి 4 నుంచి 5 నిమిషాల సమయం పడుతుంది. రైతుమిత్ర గ్రూపులు వారి సొంత పొలాలతోపాటు ఇతరులకు కూడా కొంత రేటు నిర్ణయించి అద్దెకు వాటిని సరఫరా చేయవచ్చు. ఈ డ్రోన్ బ్యాటరీపై నడుస్తుంది. బ్యాటరీలను చార్జింగ్ చేసుకునే అవకాశం ఉంది. ఇతరులకు పురుగుమందు పిచికారీకి అద్దెకు ఇచ్చేటప్పుడు ఎకరానికి రూ.400 నుంచి రూ.500 వరకు వసూలు చేసుకోవచ్చు. డ్రోన్ వినియోగం వల్ల రైతుకు సమయం ఆదా అవ్వడంతోపాటు కూలీల కొరత ఇబ్బంది ఉండదు. కోనసీమ కూలీల కొరత రైతులను వెంటాడడంతో వరిసేద్యంలో యంత్రాల వినియోగం వైపు దృష్టి సారిస్తున్నారు.

కోనసీమ జిల్లాలో 40 డ్రోన్లు

డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 40 డ్రోన్లు మంజూరుకాగా, ఇప్పటివరకు 13 మండలాల్లో 20 రైతు మిత్ర గ్రూపులకు అందించగా మరో నాలుగు గ్రూపులకు డ్రోన్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. ఎనిమిది గ్రూపులకు సంబంధించి బ్యాంకు సిబిల్ రేటింగ్ లేక ఆయా గ్రూపులకు అర్హత కోల్పోయాయి. మరో ఎనిమిది గ్రూపులు డ్రోన్లు తీసుకునేందుకు అంతగా ఆసక్తి చూపలేనట్టు జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు తెలిపారు. అర్హత ఉన్న గ్రూపులు డ్రోన్లు తీసుకోవడానికి ముందుకొస్తే ఇవ్వడానికి వ్యవసాయశాఖ సిద్ధంగా ఉందన్నారు.

వానొచ్చింది!


అమలాపురంలో..


రాజమహేంద్రవరంలో..

ఆషాఢం ఎండలు దంచి కొడుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రోహిణీ కార్తె మాదిరిగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు గత కొన్నిరోజులుగా ఎండ వేడిమికి తల్లడిల్లుతున్నారు. గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. అమలాపురం, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల్లో చిరుజల్లులతో ప్రారంభమై ఒక్కసారిగా వాన దంచికొట్టింది. ఆకాశంలో మేఘాలు అలా తొలగిపోగానే మళ్లీ భానుడు కొన్నిచోట్ల తన ప్రతాపాన్ని చూపించాడు. దాంతో ఒక్కసారిగా గుబులు రేగి జనం మళ్లీ చెమటలతో తడిసి ముద్దయ్యారు. రాజమహేంద్రవరం పరిసరాల్లో మాత్రం చల్లదనంతో జనం ఊపిరిపీల్చుకున్నారు.

- అమలాపురం రూరల్/ రాజమహేంద్రవరం



అలుమ్ని ఆడిటోరియంలో జరిగిన వర్క్‌షాప్‌లో పాల్గొన్న అతిథులు, జేఎన్టీయూకే అధికారులు

ప్రముఖుల పరిశోధనలు సమాజానికి ఎంతో దోహదం

- ఎన్‌బీఏ, న్యాక్ ఛైర్మన్ అనిల్ సహస్ర బుద్దే
- రోల్ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీపై జేఎన్టీయూకేలో వర్క్‌షాప్

జేఎన్టీయూకే, జూలై 17 (ఆంధ్రజ్యోతి): యూసీఈకే ఓక్ ఉత్సవాల సందర్భంగా జేఎన్టీయూకేలోని అలుమ్ని ఆడిటోరియంలో 'రోల్ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ- 2020 ఇన్ స్వర్ణాంధ్ర వికసిత్ భారత్-2047' అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాప్‌ను ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్‌ఆర్కే ప్రసాద్ గురువారం జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. నలుగురు ముఖ్య ఉపన్యాసకులు పాల్గొనగా... మొదటిగా ఎన్‌బీఏ, న్యాక్ ఛైర్మన్ అనిల్ సహస్ర బుద్దే ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతూ భారతదేశంలో పూర్వకాలంలో నిర్వహించిన తక్షశిల, నలంద విశ్వవిద్యాలయాల సంస్కృతిని కొనియాడారు. వర్గీస్ కురియన్, స్వామినాథన్, ఎఫ్‌సీ కోహ్లీ మొదలైన ప్రముఖుల పరిశోధనలు సమాజానికి ఎంతగానో ఉపయోగపడ్డాయని వివరించారు. భారతదేశంలో పరిశోధనలకు ఐదు శాతం మాత్రమే నిధులు మంజూరవుతున్నాయని, దీనివల్ల పరిశోధనలు కుంటుపడుతున్నాయన్నారు. 2047కల్లా అందరికీ ఆహా రం, నీరు, వసతి, ఉపాధి, అంతర్జాలం, విద్య, నైపుణ్యాలు, విద్యుత్, సుపరిపాలన ప్రజలకు పుష్కలంగా అందేలా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. అనంతరం న్యూఢిల్లీకి చెందిన సౌత్ ఏషియన్ యూనివర్శిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కేకే అగర్వాల్ మాట్లాడుతూ నూతన విద్యా విధానం-2020 పట్టభద్రులను అందించడమే కాకుండా సమాజానికి పరిపూర్ణమైన వ్యక్తులను అందించే విధంగా రూపొందించబడిందన్నారు. పరీక్షల సమయాన్ని 3 నుంచి 2 గంటలకు కుదిస్తే విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావడం తేలిక అవుతుందన్నారు. యూజీసీ మాజీ ఛైర్మన్ ప్రొఫెసర్ వేద్‌ప్రకాష్ మాట్లాడుతూ ప్రాథమిక విద్యను తప్పనిసరి చేయాలని, ఉన్నత విద్యలో ప్రతిభకు పట్టం కట్టాలన్నారు. సుందర్ పిచాయ్ ఐఐటీలో కాకుండా చిన్న కళాశాలలో చదివారన్నారు. అమెరికా జీడీపీలో పరిశోధనలకు 3.9 శాతం కేటాయిస్తారని, మన దేశంలో 0.65 శాతానికే పరిమితమైపోయిందన్నారు. ఆన్‌లైన్, దూర విద్యకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. పూర్వ విద్యార్థి, చెన్నయ్ ఐఐటీ సీఎస్ఈ ప్రొఫెసర్ డి.జానకిరాం మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులు ఎక్కువ ఒత్తిడికి గురవుతున్నారన్నారు. కళలు, క్రీడలు, పుస్తకపఠనంపై ఆసక్తి కలిగించి ఒత్తిడి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రోల్ ఆఫ్ ఇండస్ట్రియలిస్ట్ టు కొలాబరేటివ్ విత్ అకడమిక్ ఇనిస్టిట్యూషన్స్ టు రియలైజ్ ఆబ్జెక్టివ్స్ ఆఫ్ స్వర్ణాంధ్ర వికసిత్ భారత్ 2047పై ప్యానల్ చర్చ నిర్వహించారు. దీనికి వర్శిటీ పూర్వ విద్యార్థి వీవీ రావు అధ్యక్షత వహించగా డాక్టర్ సరోజ అగర్వాల్, డాక్టర్ సిమ్లా, వీటీ చంద్రశేఖర్, దాసరి రామకృష్ణ, కేవీఆర్ఎస్ మూర్తి, సూర్యప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ ఎంఎం పళ్లంరాజులను సత్కరించారు. వర్క్‌షాప్‌లో రెక్టార్ వీవీ సుబ్బారావు, రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు, ఓఎస్డీ కోటేశ్వరరావు, ఓక్ ఉత్సవ కమిటీ ఛైర్మన్ పి.ఉదయభాస్కర్, వైస్ ఛైర్మన్ శ్రీనివాసకుమార్, పలువురు డైరెక్టర్లు, యూసీఈకే ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్స్, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజును సత్కరిస్తున్న ఉప కులపతి ప్రసాద్, అతిథులు





గురువారం సాయంత్రం జేఎన్టీయూకే అనుబంధ కళాశాలల విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకాలు


సీఎం చంద్రబాబు సమక్షంలో కేంద్ర సహాయ మంత్రిని కలిసిన కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

'కాకినాడలో క్రీడల అభివృద్ధికి సహకరించాలి'

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పార్లమెంటరీ పరిధిలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా క్రీడలను అభివృద్ధి చేసేందుకు 'ఖేలో ఇండియా' కింద మౌలిక వసతులు కల్పించాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌లతో కలిసి కేంద్ర క్రీడల శాఖ సహాయ మంత్రి మన్‌సుఖ్ మాండవీయను ప్రత్యేకంగా కలిసారు. ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. వచ్చే ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో మార్షల్ ఆర్ట్స్ గేమ్స్ నిర్వహించే అవకాశం కల్పించినందుకు కేంద్ర సహాయ మంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పోక్సో కోర్టు స్పెషల్ పీపీగా శ్రీదేవి



కాకినాడ క్రైం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పెంకే శ్రీదేవిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె కాకినాడ బార్ అసోసియేషన్‌లో 24 ఏళ్లుగా న్యాయవాదవృత్తిలో కొనసాగుతున్నారు. శ్రీదేవిని కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏలూరి సుబ్రహ్మణ్యం, సీహెచ్ చంటి, పలువురు న్యాయవాదులు అభినందించారు.


రాజోలులో హెడ్ పోస్టాఫీసును ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ప్రతి పోస్టల్ ఉద్యోగీ ఓ మొబైల్ ఏటీఎం

- ఇకపై అందుబాటులో లేని సేవలంటూ ఉండవు.. అభివృద్ధి దిశగా పోస్టాఫీసులు
- కేంద్ర కమ్యూనికేషన్స్ గ్రామీణాభివృద్ధిశాఖ సహాయమంత్రి పెమ్మసాని
- రాజోలులో రూ.2.27 కోట్లతో నిర్మించిన హెడ్‌పోస్టాఫీస్‌కు ప్రారంభోత్సవం

రాజోలు,జూలై17(ఆంధ్రజ్యోతి): ప్రతీ పోస్టల్ ఉద్యోగిని మొబైల్ ఏటీఎంగా మార్చే ప్రత్యేక కార్యక్రమం చేపట్టబోతున్నామని కేంద్ర కమ్యూనికేషన్స్ గ్రామీణాభివృద్ధిశాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ప్రతీ గ్రామంలో పోస్టాఫీసు ద్వారా అందుబాటులో లేని సేవలేవీ ఇకపై ఉండవన్నారు. ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో పోస్టాఫీసులన్నీ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నాయన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం రాజోలులో కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.2 కోట్ల 27లక్షల 45 వేలతో నూతనంగా నిర్మించిన రాజోలు హెడ్ పోస్టాఫీసు కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం శివకోడు శ్రీమంగెన గంగయ్య తెలగా కల్యాణ మండపంలో అమలాపురం ఎంపీ హరీష్‌బాలయోగి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పాతకాలంలో పోస్టాఫీసు అంటే కేవలం లేఖలు పంపించే ప్రదేశం మాత్రమే అనిపించేదని, కానీ ఈ రోజుల్లో సేవింగ్స్, పేమెంట్స్ బ్యాంకు, పార్శిల్, డెలివరీ కేంద్రంగా మారిందన్నారు. కేవలం ఒకట్రెండు రోజుల్లోనే డెలివరీ వంటి సాంకేతిక సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గతేడాది రూ.5 వేల కోట్లతో దేశవ్యాప్తంగా పోస్టల్ ఐటీ వ్యవస్థను పునరుద్ధరించిందని తెలిపారు. ప్రతీ పోస్టాఫీసుకు ఆధునిక సాంకేతికత అందజేశామని పేర్కొన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా వందలాది కోట్ల రూపాయలు గ్రామాల్లో పోస్టాఫీసు సేవల ద్వారానే చేరాయని అన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ విశిష్ట సేవలు అందిస్తున్న పోస్టల్ శాఖ ప్రజల మధ్య వారధిగా పనిచేస్తుందన్నారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగి మాట్లాడుతూ పోస్టల్ వ్యవస్థ అభివృద్ధి కోసం తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. అనంతరం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మిడి ఇజ్రాయిల్ ప్రసంగించారు. తొలుత రాజోలు హెడ్ పోస్టాఫీసు ఆవరణలో శిలాఫలకాన్ని కేంద్రమంత్రి పెమ్మసాని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మట్టా శైలజ, ఎంపీటీసీ కె.పుష్పలత, సర్పంచ్ ఆర్.జ్యోతి, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, అమలాపురం ఆర్డీవో కె.మాధవి, ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ బీపీ శ్రీదేవి, విశాఖపట్నం రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ డీఎస్వీఆర్ మూర్తి, రాజోలు హెడ్ పోస్టుమాస్టర్ జి.శివప్రసాద్, తహశీల్దార్ సీహెచ్ భాస్కర్, ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, సెక్రటరీ రెహ్మాన్ పాల్గొన్నారు.

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి : చినరాజప్ప


పెద్దాపురంలో ఉప తపాలా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

- పెద్దాపురం పోస్టల్ భవనాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన పెమ్మసాని

పెద్దాపురం,జూలై17(ఆంధ్రజ్యోతి): తపాలా సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. కాకినాడ జిల్లా పెద్దాపురం రామారావుపేటలో రూ.1.70 కోట్లతో నిర్మించిన ఉప తపాలా కార్యాలయ భవనాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్లశాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ తపాలా శాఖ తన సేవల విస్తరణలో మరో ముందడుగు వేసిందన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ తపాలా శాఖ గ్రామీణ ప్రాంతాల్లో సైతం డిజిటల్ సేవలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో పెద్దాపురం మున్సిపల్ ఛైర్పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు, పోస్టల్ సూపరింటెండెంట్ నాగేశ్వర్‌రెడ్డి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ అనిల్, రామకృష్ణ, రమణమూర్తి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.


ఏపీఈపీడీసీఎల్ నాయకులను సత్కరిస్తున్న దృశ్యం

క్షేత్ర స్థాయిలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

- ట్రాన్స్‌కో ఉమ్మడి రాజమహేంద్రవరం సర్కిల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

కాకినాడ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, జేఎల్ఎం జీఆర్-2 కార్మికులకు డిపార్ట్‌మెంట్ రూల్స్ వర్తింపజేయాలని ట్రాన్స్‌కో ఉమ్మడి రాజమహేంద్రవరం సర్కిల్ జిల్లా అధ్యక్షుడు పీఎస్ఎస్ వెంకటేశ్వరరావు కోరారు. గురువారం కాకినాడలోని శాంతిభవన్ సమావేశ హాలులో ఏపీఈపీడీసీఎల్ ఉమ్మడి జిల్లా సర్వసభ్య సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎ.రాజారత్నం మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని, పెరిగిన పని భారానికి అనుగుణంగా అదనపు పోస్టులు మంజూరు చేయాలని కోరారు. జిల్లా కోశాధికారి ఎస్‌కే బషీర్ మాట్లాడుతూ నాలుగు డీఏలను సత్వరం చెల్లించాలన్నారు. రాష్ట్ర నాయకులు టీసీహెచ్ వెంకటరావు, సరెళ్ల సత్యనారాయణ, దమ్ము సత్తిబాబు, జిల్లా ప్రచార కార్యదర్శి రమేష్ (జగన్), రామచంద్రపురం డివిజన్ అధ్యక్షుడు ఎంసీహెచ్ఎస్ఎస్ కుమార్‌బాబు, కార్యదర్శి పీవీ రమణ, అమలాపురం డివిజన్ అధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ, కార్యదర్శి బీసీహెచ్ సాహెబ్, రాజమహేంద్రవరం టౌన్ డివిజన్ అధ్యక్షుడు జి.గణేష్, కార్యదర్శి కె.శ్రీనివాస్, రాజమహేంద్రవరం రూరల్ డివిజన్ అధ్యక్షుడు ఎంసీహెచ్ అప్పలరాజు, కార్యదర్శి పిల్లి ప్రసాద్, కోశాధికారి శివ, జగ్గంపేట డివిజన్ అధ్యక్షుడు నాయుడు, కార్యదర్శి రాజు, కాకి నాడ డివిజన్ అధ్యక్షుడు కె.జాన్‌వెస్లీ, కార్యదర్శి నాగేంద్ర, పైడిరాజు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు. ఆయా డివిజన్ల నాయకులు తమ డివిజన్లలోని వివిధ సమస్యలపై చర్చించారు.

జాతీయ జూనియర్ హాకీ ఉమెన్ చాంపియన్‌షిప్, ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహణకు

సక్రమ ఏర్పాట్లు చేయాలి

- కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జాతీయ జూనియర్ హాకీ ఉమెన్ చాంపియన్‌షిప్, ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ సక్రమ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కాకినాడ జిల్లా జాయింట్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. ఈ రెండింటికి సంబంధించి కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను గురువారం ఆయన జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, ఆర్డీవో మల్లిబాబు, మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనరు సుధాకర్, ఎస్ఈ వెంకటరావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కృష్ణారావు, హెల్త్ ఆఫీసర్ పృథ్వీచరణ్, ఇతర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆగస్టు 1 నుంచి 20వ వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, 3 నుంచి 20వ తేదీ వరకు జాతీయ జూనియర్ హాకీ చాంపియన్‌షిప్ కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతాయన్నారు. ఆర్మీ ర్యాలీకి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 13 ఉమ్మడి జిల్లాల నుంచి అభ్యర్థులు హాజరు కానున్నారు. హాకీ పోటీలకు దేశవ్యాప్తంగా 26 రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది మహిళా క్రీడాకారులు, 200 మంది సహాయక సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో రోజుకు సుమారు 800 పాల్గొనే అవకాశమున్న నేపథ్యంలో అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను జేసీ ఆదేశించారు.

సత్యదేవా.. అసత్యం కనవా..!

- నకిలీ రసీదులతో పీఎఫ్ కాజేసేందుకు ఏజెన్సీ కుట్ర
- ఆలయంలో పనిచేస్తున్న 350 మంది పారిశుధ్య కార్మికులు
- దేవస్థానంలో ఒక అధికారి వెనకుండి నడిపించిన వైనం
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన..


అన్నవరం ఆలయ దేవస్థానం

అన్నవరం, జూలై17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో పారిశుధ్య కార్మికులను సరఫరా చేసే కనకదుర్గ కాంట్రాక్ట్ సంస్థ ఆలయ అధికారులనే బురిడీ కొట్టించింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే ఆలయంలో సుమారు 350 మంది వరకు పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వీరి మూడునెలల పీఎఫ్ సొమ్మును తన జేబులో వేసుకునే దురుద్దేశంతో సంబంధిత ఏజెన్సీ మోసానికి పాల్పడినట్టు తెలుస్తోంది. ఈ విషయం శానిటరీ విభాగంలో పనిచేస్తున్న ఓ అధికారికి తెలిసినప్పటికీ ... ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా మిన్నకుండిపోయి తన పాత్ర పోషించినట్టు విశ్వసనీయ సమాచారం. వివరాల్లోకి వెళితే అన్నవరం దేవస్థానంలో పారిశుధ్య కార్మికుల సరఫరాకు నెలకు రూ. 59 లక్షలు దేవస్థానం చెల్లించేలా దేవాదాయశాఖ కమిషనర్ అనుమతితో ఒక సంస్థ నామినేట్ చేసుకుంది. అయితే పారిశుధ్య కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలు ఈ సంస్థకు చెల్లిస్తే వారు కార్మికులకు నెలవారీగా అందించాలి. దీంతోపాటుగా పీఫ్ సొమ్మును కాంట్రాక్ ఏజెన్సీ కార్మికుల ఖాతాకు జమచేయాలి. కాంట్రాక్ట్ సంస్థ పీఎఫ్ డబ్బులు సరిగ్గా చెల్లించినట్టు దేవస్థానం అధికారులకు చూపితేనే దేవస్థానం ఆ నిధులు విడుదల చేస్తుంది. ఇక్కడే సదరు సంస్థ తన కుయుక్తిని ప్రదర్శించింది. మార్చి నుంచి పీఎఫ్ చెల్లించినట్టు నకిలీ రశీదులు చూపించి దేవస్థానం నుంచి మొత్తాన్ని జమ చేసుకుని కార్మికుల జీతాలు మాత్ర మే చెల్లించి, పీఎఫ్ సొమ్ము చెల్లించకుండా జాప్యం చేసింది. ఈ విషయాన్ని వారంరోజుల క్రితం ఛైర్మన్ రోహిత్ దృష్టికి పారిశుధ్య కార్మికులు తీసుకెళ్లగా, ఆయన దేవస్థానం శానిటరీ విభాగ అధికారులతో మాట్లాడి, ఇందులో సంబంధిత ఏజెన్సీ ఉంటే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించగా, ఆగమేఘాలపై మూడునెలల పీఎఫ్ సొమ్మును ఈనెలలో మూడు విడతలగా కార్మికుల ఖాతాల్లో సదరు సంస్థ జమచేసింది. ఇంతా జరుగుతున్నా ... శానిటేషన్ విభాగ అధికారులు ఏమి చేస్తున్నారనే విమర్శలు బాహాటంగానే వినిపిస్తున్నాయి. ఈ విషయం ఈవో సుబ్బారావు దృష్టికి చేరడంతో దీనిపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని శానిటరీ విభాగ ఏఈవో, సూపరింటెండెంట్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించడంతో గురువారం వారు దీనిపై విచారణ చేపట్టగా, మూడు నెలల సొమ్ములకు నకిలీ రసీదులు సృష్టించి వాటికి సంబంధించి ఈనెలలో మూడు విడతలగా సిబ్బంది పీఎఫ్ ఖాతాల్లో జమ చేసినట్టు గుర్తించారు. అయితే మోసానికి పాల్పడిన ఈ సంస్థపై చర్యలు తీసుకుంటారా లేదా అనేది వేచిచూడాలి. ఈ విషయం బయటకు పొక్కకుంటే త్వరలోనే ప్రధానాలయాలన్నింటికీ సెంట్రలైజ్డ్ కాంట్రాక్ట్ ఖరారవుతుందనే సమాచారంతో ప్రస్తుత ఏజెన్సీ సంస్థ వాటిని కాజేయాలనే దురుద్దేశంతో ఈ మోసానికి పాల్పడినట్టు తెలుస్తోంది.

అంతర్జాతీయ మార్కెట్‌కు గిరిజన ఉత్పత్తులు

- హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ హరిప్రసాద్


కార్యక్రమంలో మాట్లాడుతున్న హరిప్రసాద్

రంపచోడవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): గిరిజన ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. రంపచోడవరం మండలం ఆర్కా రెస్టారెంట్‌లో జనసేన నాయకుడు కుర్ల రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన గిరిజనులు వెదురు ఉత్పత్తుల ప్రదర్శనకు హరిప్రసాద్, ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు తయారు చేసిన ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు పొందేందుకు అవసరమైన అనుమతులు తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కళలపై ఉన్న మక్కువతోనే హస్తకళలను ప్రోత్సహిస్తున్నారన్నారు. ఇటీవల దేశ వ్యాప్తంగా జరిగిన వన్ డిస్ట్రిక్ వన్ ప్రైస్ అనే హస్తకళల ప్రదర్శనలో 29 బహుమతులకు రాష్ట్రానికి 10 బహుమతులు వచ్చాయన్నారు. ఎమ్మెల్యే శిరీషదేవి మాట్లాడుతూ కూటమిప్రభుత్వం ఇటువంటి కళలు జాతీయస్థాయిలో గుర్తింపు పొందేందుకు ప్రోత్సహిస్తోందన్నారు. హస్తకళల కార్మికులకు ప్రోత్సాహక రుణాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలిశెట్టి సూర్యనారాయణ, అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి వంపురి గంగులయ్య, లీగల్ సెల్ అధ్యక్షుడు కాకి స్వామి, మండలాధ్యక్షుడు పాపోలు శ్రీనివాస్, 11 మండలాల జనసేన మండలాధ్యక్షులు, వీరమహిళలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు విద్యార్థులకు అస్వస్థత

- ఎండ వేడిమే కారణం


ఆసుపత్రిలో విద్యార్థులను పరామర్శిస్తున్న ఎంఈవో, తహశీల్దార్

జగ్గంపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం కాండ్రేగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎండ తీవ్రత కారణంగా విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురయ్యారు. పి.దివ్య (ఎనిమిదో తరగతి), ఏ.మేరీ (ఏడో తరగతి), జి.దుర్గాభవాని (పదో తరగతి), సీహెచ్ దివ్య (పదో తరగతి), ఎం. పావని (పదోతరగతి), ఎ.గనిక లక్ష్మి (ఎనిమిదో తరగతి) ఉన్నారు. ఉదయం పది గంటలకు వారు కళ్లు తిరిగిపోవడంతో ఉపాధ్యాయులు గుర్తించారు. వెంటనే విద్యాకమిటీ ఛైర్మన్, ఉపాధ్యాయులు స్పందిస్తూ ఇద్దరిని జగ్గంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో, మరో నలుగురు ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. విద్యార్థులను తహశీల్దార్ రమేష్, ఎంఈవో ఆర్.స్వామి పరామర్శించారు. వారి పరిస్థితి క్షేమంగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఇప్పటికైనా విద్యార్థులకు విశాలమైన తరగతి గదుల్లో విద్యాబోధన చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ట్రాక్టర్‌ను తగలబెట్టిన దుండగులు

ముమ్మిడివరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఓ రైతు మకాంలో ఉన్న ట్రాక్టర్‌ను బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు పెట్రోలు పోసి నిప్పంటించారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చెయ్యేరుకు చెందిన చవటపల్లి సత్యనారాయణకు ముమ్మిడివరం మండలం అయినాపురం శివారు గొరగనమూడి సమీపంలో కొబ్బరితోటలో మకాం ఉంది. అందులో పెట్టగా... దుండగులు ఇంజన్ స్టార్ట్ చేసి పెట్రోలు పోసి నిప్పంటించారు. దీంతో ట్రాక్టర్ టైర్లు, ఇంజను భాగం కాలిపోయింది. దీనిపై సదరు ట్రాక్టరు యజమాని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ట్రాక్టరు విలువ సుమారు రూ. ఐదు లక్షలు ఉంటుందన్నారు. అమలాపురం డీఎస్పీ ప్రసాద్ ఆదేశాల మేరకు ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్ సంఘటనా స్థలానికి వెళ్లి డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. ట్రాక్టరు యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముమ్మిడివరం ఎస్ఐ జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చాకుతో పొడిచి... పరారై..!

- ప్రియుడి చేతిలో ప్రియురాలి దారుణ హత్య
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బి.సావరంలో ఘటన
- రెండు ప్రత్యేక పోలీస్ బృందాలు గాలింపు


ఓలేటి పుష్ప (ఫైల్‌ఫొటో)

రాజోలు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం బి.సావరంలో గురువారం విషాదం చోటుచేసుకుంది. ప్రియుడి చేతిలో ప్రియురాలు దారుణ హత్యకు గురైంది. దీనికి సంబంధించి రాజోలు ఎస్ఐ రాజేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... బి.సావరం సిద్ధార్థ నగర్‌లో ఓలేటి పుష్ప (22), షేక్ షమ్మా(22) ఓ అద్దె ఇంట్లో ఉంటూ సహజీవనం చేస్తున్నారు. పుష్పకు గతంలో వివాహమై భర్త నుంచి విడాకులు తీసుకుంది. ఈమెకు రాజోలుకు చెందిన ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్న షేక్ షమ్మాతో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. అయితే షమ్మా చెడు వ్యసనాలకు లోనై డబ్బు మోజులో పడి గత కొన్ని రోజులుగా మద్యం తాగొచ్చి పుష్పతో వ్యభిచారం చేయాలని ఒత్తిడి చేస్తున్నాడు. బుధవారం రాత్రి కూడా ఇదే విషయంపై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీనికి పుష్ప నిరాకరించడంతో కోపోద్రిక్తుడైన షమ్మా ఆమెను చాకుతో పొట్ట, కాలిపై పొడిచి హత్య చేశాడు. దీన్ని అడ్డుకునే ప్రయత్నం చేసిన పుష్ప తల్లి గంగ, సోదరులను కూడా గాయపరిచి పరారయ్యాడు. తీవ్రంగా రక్తస్రావమైన పుష్ప ఘటనా స్థలంలోనే మృతిచెందింది. డబ్బుల కోసం తన కూతురును మానసికంగా వేధించేవాడని మృతురాలి తల్లి గంగ విలపిస్తోంది. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ సుంకర మురళీమోహన్, సీఐ టీవీ నరేష్‌కుమార్ వచ్చి పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం రెండు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు.

‘పురుషోత్తపట్నం’ సమస్యను

సామరస్యంగా పరిష్కరించుకోవాలి

- రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసా నంద సరస్వతి స్వామి


మాట్లాడుతున్న శ్రీనివాసానంద స్వామి

ఎటపాక, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పురుషోత్తపట్నంలోని దేవస్థానం భూముల్లో నెలకొన్న భూ వివాదం ఎనిమిది దశాబ్దాలుగా కొనసాగుతోందని, దీనిపై రైతులు, భద్రాచలం దేవస్థానం అధికారులు కమిటీలుగా ఏర్పడి సామరస్యంగా పరిష్కరించుకోవాలని రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి స్వామి, సాధు పరిషత్ గౌరవ అధ్యక్షుడు అట్లూరి నారాయణరావు అన్నారు. శ్రీనివాసానంద సరస్వతి స్వామి, గౌరవ అధ్యక్షుడు నారాయణరావుతోపాటు హిందూ సంఘాల నాయకులు గురువారం పురుషోత్తపట్నంలోని దేవస్థానం అధికారులు, స్థానిక రైతుల మధ్య జరుగుతున్న భూవివాదంపై నిజనిర్ధారణ కమిటీగా పర్య టించారు. ఈ సందర్భంగా విలేకరుల సమా వేశంలో వారు మాట్లాడారు. గ్రామంలో తరతరాలుగా ఈ భూమిని నమ్ముకుని జీవిస్తున్న వారికి అన్యాయం చేస్తే ఊరు కోబోమన్నారు. దేవస్థానం అధికారులు భూములకు పర్య వేక్షకులుగా ఉండకుండా ఉన్న భూములను అమ్మేస్తున్నారని ఆరోపించారు. రామయ్య భూములు అన్యమతస్థుల ప్రార్థనా మందిరాలు, మిషనరీ స్కూళ్లకు 20 ఎకరాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. వారికి దేవస్థానం అధికారులు నోటీసులు ఇవ్వాలని సూచించారు. ఎటపాక సీఐ కన్నపరాజు ఆధ్వర్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

మందుబాబులకు జైలు, జరిమానా

కాకినాడ క్రైం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 18 మందికి కాకినాడ ఐదో ఏజేఎఫ్‌సీఎం మెజిస్ట్రేట్ ఎస్‌కే షరీన్ జైలు, జరిమానా విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్ 1, 2 సీఐలు ఎన్. రమేష్, డి.రామారావు తమ సిబ్బందితో బుధవారం రాత్రి బ్రీత్ ఎనలైజర్లతో పరిశీలించగా వీరంతా పట్టుబడ్డారు. వారిని గురువారం కోర్టులో హాజరుపర్చగా, నాయ్యమూర్తి ఇందులో ఒకరికి నాలుగు రోజులు, మరో ఇద్దరికి మూడురోజులు, మరో నలుగురికి రెండు రోజులు , ఇద్దరికి ఒకరోజు చొప్పున జైలు శిక్ష విధించారు. మరో తొమ్మిది మందిలో ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున మొత్తం రూ. 90,000 జరిమానా విధించినట్టు సీఐ రమేష్ తెలిపారు. పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పెరవలి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పెరవలి మండలంలోని జాతీయ రహదారి ఖండవల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం తెల్లవారుజామున ఆచంట మండలం వల్లూరుకి చెందిన నార్కిమిల్లి వెంకటేశ్వరరావు (42) అనే వ్యక్తి ట్రాక్టర్‌పై పంగిడి నుంచి మెటల్ వేసుకురావడానికి తన గ్రామం నుంచి బయలుదేరాడు. ఈక్రమంలో ఖండవల్లి వద్దకు వచ్చేసరికి రోడ్డుపై అడ్డుగా ఏర్పాటు చేసిన వేగ నియంత్రణ ఐరన్ డ్రమ్ములను గమనించకపోవడంతో ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుది. దీంతో ట్రాక్టర్ నడుపుతున్న వెంకటేశ్వరరావు ట్రాక్టర్‌పై నుంచి రోడ్డుపై పడిపోవడంతో ట్రాక్టర్ ట్రాలీ టైరు అతనిపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

జంతు సంరక్షణలో హైకోర్టు ఆదేశాలు పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

రాజమహేంద్రవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాలను అనుసరిస్తూ జంతువుల సంరక్షణ కోసం తప్పనిసరిగా సొసైటీలను నియమించాలని, షెల్టర్‌లను ఏర్పాటు చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్‌ఏ) చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. జంతువులపై హింస నివారణకు సొసైటీల ఏర్పాటు, నియంత్రణ నియమాలు, కార్యాచరణపై గురువారం ఆమె ఉమ్మడి తూర్పుగోదావరిలోని వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ కొన్ని చోట్ల సొసైటీలు, షెల్టర్‌లు లేవని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం చొరవ చూపి వాటిని ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన స్థలం, నిధులు కేటాయించాల్సిందిగా కలెక్టర్లకు లేఖ రాస్తామన్నారు. సొసైటీల వివరాలు, వాటి ద్వారా సంరక్షించిన జంతువుల సంఖ్య తదితర సమాచారాన్ని ప్రతి నెలా డీఎల్ఎస్‌ఏకు అందజేయాలన్నారు. హైకోర్టు తీర్పులో సూచించిన జంతు సంరక్షణ చర్యలను తీసుకోకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తే కోర్టు ధిక్కారణ చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని పీడీజే హెచ్చరించారు. జంతువులకు కూడా హక్కులు ఉంటాయన్నారు. వాటిని తరలించే సమయంలో పశుగ్రాసం, నీరు తప్పక అందించాలన్నారు. వాహనాల్లో కనీసం కదిలే అవకాశం కూడా లేకుండా జంతువులను తరలించడం క్రూరత్వం కిందకు వస్తుందన్నారు. ఇలా అక్రమంగా జంతువులను తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసు, రవాణా శాఖలను ఆదేశించారు. పట్టణాలు/నగరాల్లో జంతువులను రోడ్లపై వదిలిపెట్టరాదన్నారు. గాయపడిన జంతువుల చికిత్సకు అంబులెన్సులు ఉన్నాయని, ఆ సదుపాయాన్ని నెం.1962కి ఫోన్ చేయడం ద్వారా వినియోగించుకోవచ్చని ప్రధాన న్యాయమూర్తి వెల్లడించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్‌ఏ కార్యదర్శి శ్రీలక్ష్మీ, ఏసీబీ కోర్టు జడ్జి ఎల్.వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాధారణ స్థాయికి గోదావరి ప్రవాహం


రాజమహేంద్రవరం వద్ద గోదావరిలో వరద నీటి ప్రవాహం

ధవళేశ్వరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఉధృతంగా ప్రవహించిన గోదావరి కొద్దిరోజులుగా తగ్గుతూ ప్రవహిస్తూ సాధారణస్థాయికి చేరుకుంటోంది. దీంతో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ గేట్లను దించి వేసి నీటి విడుదలను నియంత్రిస్తున్నారు. మద్దూరు, విజ్జేశ్వరం ఆర్మ్‌లలోని మొత్తం గేట్లను దించి నీటి విడుదలను నిలిపివేయగా ధవళేశ్వరం, ర్యాలీ ఆర్మ్‌లలోని మొత్తం గేట్లను 10 మిల్లీమీటర్ల మేర ఎత్తి 36,154 క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదయింది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పుడెల్టాకు 5వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2600క్యూసెక్కులు పశ్చిమడెల్టాకు 7200క్యూసెక్కులు చొప్పున 14,800క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద క్రమంగా తగ్గుతున్న నీటి మట్టం గురువారం సాయంత్రానికి 14.50 అడుగులకు చేరుకుంది.

- డెల్టా కాలువలకు 14,800 క్యూసెక్కుల నీరు విడుదల

చిన్నారి మోహన మృతి బాధాకరం: ఎంపీ


చిన్నారి తల్లిదండ్రులను పరామర్శిస్తున్న ఎంపీ పురందేశ్వరి

కడియం, జూలై 17(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం మాధవరాయుడుపాలెం పంచాయతీ పరిధిలో చైనత్యగనర్‌కు చెందిన డొక్కా ఈశ్వర్-శ్రావణిల కు మార్తె మోహన అనే చిన్నారి మృతి చెందడం బాధాకరమని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బాధిత కుటుంబాన్ని ఆమె గురువారం పరామర్శించి ఓదార్చారు. మోహనకు స్పైనల్ మస్క్యులర్ ఆట్రోఫి (ఎస్ఎంఏ) అనే సమస్య ఉందని, వైద్యం కోసం కోట్ల విలువైన ఇంజక్షన్ చేయాలని హైదరాబాద్ వైద్యులు చెప్పగా విషయాన్ని ఎంపీ పురందేశ్వరి దృష్టికి, రాజమహేంద్రవరం వచ్చిన కేంద్రమంత్రి గజేంద్ర షెకావత్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మోహన వైద్యం కోసం చర్యలు చేపట్టామని, పీఎంవో కార్యాలయానికి నివేదించడతో పాటు, నిధుల కోసం ప్రయత్నిస్తుండగా మోహన మృతి చెందిందని ఎంపీ విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ఆకుల శ్రీధర్, బొర్సు సుబ్రహ్మణ్యం, దాసరి ముత్యం, కొత్తపల్లి శివ, తాలాబత్తుల భాస్కర్, బొప్పన లోవరాజు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల రెన్యువల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): జోన్-1, జోన్-2 పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న అధ్యాపకులను 2025-2026 విద్యాసంవత్సరానికి రెన్యువల్ చేయడానికి దరఖాస్తులు కోరుతున్నామని రాజమహేంద్రవరంలోని కళాశాల విద్యాశాఖ ప్రాంతీయ విద్యాసంయుక్త సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. జోన్-1లో 139, జోన్-2లో 178 పోస్టులకు రెన్యువల్ చేయనున్నట్టు చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్ 30వ తేదీ నాటికి కాంట్రాక్టు అధ్యాపకులుగా పని చేసిన వారు మాత్రమే అర్హులని, అలాగే 2025, జూన్ 1వ తేదీ నాటికి 60 ఏళ్లు నిండిన వారు రెన్యువల్‌కు అర్హులు కాదని తెలిపారు. కాంట్రాక్టు అధ్యాపకులు ఈనెల 19వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌కు దరఖాస్తు చేసుకోవాలని, 21 నుంచి 23వ తేదీ వరకూ జిల్లా సెలక్షన్ కమిటీ సమక్షంలో కౌన్సిలింగ్ జరుగుతుందని తెలిపారు. రెన్యువల్ అయిన అధ్యాపకులు 25వ తేదీన అగ్రిమెంట్ చేసుకోవాలని ప్రాంతీయ విద్యా సంయుక్త సంచాలకులు పేర్కొన్నారు.

ముంచుకొస్తున్న మలేరియా

- కోతులగుట్ట ఆస్పత్రిలో రోజుకు పది కేసులు
- బ్రెయిన్ మలేరియా కేసులు ఎక్కువగానే వస్తున్నాయి: డాక్టర్ మహేష్‌బాబు


కోతులగుట్టలో మలేరియాతో బాధపడుతున్న మహిళను పరీక్షిస్తున్న డాక్టర్ మహేష్‌బాబు

కూనవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని విలీన మండలాల్లో మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయి. రోజురోజుకు జ్వరాలు పెరగడంతో రోగులు ఆసుపత్రి బాట పడుతున్నారు. కూనవరం మండలంలోని కోతులగుట్ట ఆస్పత్రి రోగులతో కిక్కిరిసిపోతోంది. రోజుకు 8నుంచి 10 మలేరియా కేసులు నమోదవుతున్నాయి. వీరిలో ఎక్కువగా బ్రెయిన్ మలేరియా కేసులు ఉండడంతో రోగులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని భగవాన్‌పురం గ్రామానికి చెందిన ఓ ఇంట్లో నలుగురికి మలేరియా జ్వరాలు రావడంతో ప్రస్తుతం వారు కోతుల గుట్ట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అడవికి దగ్గర్లో ఉన్న గ్రామాల్లో ప్రతి ఇంట్లో ఒకరు మలేరియా జ్వరాలతో బాధపడుతున్నారు. గ్రామాల్లో పారిశుధ్య లోపం, ఆరోగ్యశాఖ నిర్లక్ష్యం కారణంగానే ఈ జ్వరాలు విజృంభిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. మండలంలో ప్రజలు మలేరియా జ్వరాలతో ఆస్పత్రి పాలవుతుంటే అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ మలేరియా జ్వరాలపై కోతుల గుట్ట ఆసుపత్రి సూపరింటెండెంట్ మహేష్ బాబును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా కూనవరం మండలంలో మలేరియా జ్వరాల కేసులు ఎక్కువగా నమోదవుతున్న మాట వాస్తవమన్నారు. ఆస్పత్రిలో రోజుకు ఎనిమిదికి పైగానే మలేరియా కేసులు నమోదవుతున్నాయని ఆయన తెలిపారు. వీరిలో బ్రెయిన్ మలేరియా కేసులు కూడా వస్తున్నాయని, వారికి సరైన చికిత్స అందిస్తున్నామని స్పష్టం చేశారు.

అనారోగ్యం తాళలేక ఆత్మహత్య

రౌతులపూడి సీహెచ్‌సీ ఆవరణలో ఉరివేసుకున్న వృద్ధుడు



రౌతులపూడి, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఇరవై ఏళ్లగా తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వ్యక్తి ఆసుపత్రి ఆవరణలోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆసుపత్రి సిబ్బంది, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రౌతులపూడి గ్రామానికి చెందిన లోకారపు చిన్న అప్పలనాయుడు(79) ఇరవై ఏళ్లగా ఆయాసం, కడుపునొప్పి, గుండె సంబంధిత వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నాడు. రెండ్రోజుల క్రితం తీవ్రమైన కడుపునొప్పి రావడంతో బంధువులు స్థానిక సీహెచ్‌సీలో చేర్పించారు. బుధవారం రాత్రి వరకూ చికిత్స తీసుకున్న అతడు గురువారం తెల్లవారేసరికి బంధువులు చూడగా ఆసుపత్రి ఆవరణలో ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఉన్నాడు. ఆసుపత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వగా స్థానిక ఎస్ఐ కేసు నమోదు చేసి మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

నిడదవోలు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని బైక్ ఢీకొట్టడంతో సైకిలిస్ట్ సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. నిడదవోలు మండలం గోపవరం గ్రామంలో గురువారం జరిగిన ఈ ఘటనలో మృతి చెందిన వ్యక్తిని గోపవరం గ్రామానికి చెందిన కొప్పర్తి మహరాజ్(47)గా గుర్తించినట్టు సమిశ్రగూడెం ఎస్ఐ బాలాజీ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

రాజరాజేశ్వరి అమ్మవారికి నేడు శాకంబరీ అలంకరణ

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని భానుగుడి కూడలిలో గల భానులింగేశ్వర స్వామి ఆలయంలో రాజరాజేశ్వరి అమ్మవారు శుక్రవారం శాకంబరిగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈవో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కూరగాయలతో అమ్మవారిని, మండపాన్ని అలంకరిస్తామని తెలిపారు.



తాటిపర్తిలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు

'నిర్ణీత మోతాదులోనే నత్రజని ఎరువుల వినియోగం'

గొల్లప్రోలు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పంటలకు సిఫార్సు చేసిన నిర్ణీత మోతాదులోనే నత్రజని ఎరువు వినియోగించాలని వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ సీతారామశర్మ, డాక్టర్ రామభద్రరాజు సూచించారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని మొక్కజొన్న, పత్తి పంటలను వారు గురువారం పరిశీలించారు. పొటాష్ ఎరువు వేసుకుంటే వ్యాధి నిరోధక శక్తి పెరిగి గింజ నాణ్యత బాగుంటుందని తెలిపారు. మెట్ట జలగల వలన పంటకు నష్టం ఉండదని, ఎక్కువగా ఉంటే ఎకరాకు రెండు కిలోల ఉప్పును వాటిపై పడేలా చల్లాలన్నారు. పర్యటనలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు పి.స్వాతి, వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

గొల్లప్రోలు యూపీహెచ్‌సీలో విచారణ

గొల్లప్రోలు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లో వైద్య సేవలు సక్రమంగా అందట్లేదని అందిన ఫిర్యాదులపై డీఎంహెచ్‌వో కార్యాలయ జిల్లా ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ అధికారి జి.లక్ష్మి గురువారం విచారణ నిర్వహించారు. రోగులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని సిబ్బందిని ఆదేశించారు. అవసరమైన పరీక్షలు చేయాలని సూచించారు. విచారణలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అమృతరావు పాల్గొన్నారు. అనంతరం లక్ష్మి చేబ్రోలు పీహెచ్‌సీని తనిఖీ చేసి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆమె వెంట వైద్యాధికారి సంతోష్



యూపీహెచ్‌సీలో విచారణ నిర్వహిస్తున్న డీపీఎంవో లక్ష్మి

వినీల్, ఎంపీహెచ్ఈవో రామ్మోహనరావు, ఎంపీహెచ్ నార్ని గంగాధర్ వున్నారు.

సాగునీటి సక్రమ సరఫరాకు చర్యలు

సర్పవరం జంక్షన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వరి సాగుకు సాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా పంట కాలువల్లో పూడికతీత పనులు చేయిస్తున్నట్టు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. తిమ్మాపురంలో ఆవ భూమి ప్రాంతంలోని మురుగు, పంట కాలువల్లో పూడిక తీతపనులను గురువారం ఆయన రైతులతో కలిసి పరిశీలించారు.



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నానాజీ

తిమ్మాపురం, పరిసర ప్రాంతాల భూముల్లో వరిసాగుకు ఏలేరు నుంచి సాగునీరు రావాల్సి ఉందని, ఇంకా నీరు రాకపోవడంతో వరినాట్లు ఆలస్యమయ్యే అవకాశం ఉందని రైతులు ఎమ్మెల్యే వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నానాజీ ఫోన్‌లో ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. పంట కాలువ శుభ్రం చేయిస్తున్నందుకు, నీటి సరఫరాకు చర్యలు తీసుకున్నందుకు ఎమ్మెల్యేకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మాదారపు తాతాజీ, దుర్గబాబు, శిరంగు శ్రీనివాసరావు, పోసిన రాము, దాసరి శివ, యాళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'ఎరువుల వినియోగంలో నియంత్రణ అవసరం'

కరప, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఎరువుల వినియోగంలో నియంత్రణ చాలా అవసరమని, రైతులు వ్యవసాయ శాఖ సూచనలు సలహాలు పాటిస్తూ మేలైన దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాఖ జేడీ ఎన్.విజయ్‌కుమార్ సూచించారు. కరపలో గురువారం ఆయన పర్యటించి పలు వెదజల్లిక పొలాలు, వరినాట్లను పరిశీలించి పలు సూచనలు జారీ చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 9వేల హెక్టార్లలో వరి నాట్లు, 6వేల హెక్టార్లలో వెదసాగు పూర్తయిందన్నారు. రైతులందరూ స్వర్ణ, 1318 రకాలను ఎంచుకుని ఖరీఫ్ సాగుచేపట్టారన్నారు. ఎరువులు, పురుగుమందుల పిచికారీకి డ్రోన్లను వినియోగించి పెట్టుబడులు తగ్గించుకోవాలన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని 80శాతం రాయితీపై ఈ డ్రోన్లను అందజేస్తుందని, జిల్లాలో ఇప్పటివరకు 42 డ్రోన్లను పంపిణీ చేశామన్నారు. కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులపై రుణాలు అందజేయాలని బ్యాంకులకు విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో కరప సబ్ డివిజన్ ఏడీ కె.బాబూరావు, కాకినాడ గ్రామీణ ఏడీ దుర్గాలక్ష్మి, మార్క్‌ఫెడ్ డీఎం మంజు, ఏఈవోలు ప్రశాంత్‌కుమార్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

'బాల్య వివాహాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు'

కొత్తపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాల్సిన బాధ్యత గ్రామ కమిటీలదే అని జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకట్రావు అన్నారు. కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గ్రామ స్థాయి బాలల సంక్షేమం, పరిరక్షణ కమిటీ అధికారులకు గురువారం నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో బాలల స్నేహపూరిత కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతినెలా మొదటి, మూడవ శుక్రవారాల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు నిర్వహిస్తున్నారన్న సమాచారం తెలిస్తే 1098 నంబరుకు తెలియజేయాలన్నారు. బాలల సంరక్షణ అధికారి జాగరపు విజయ, చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి, సర్పంచ్‌లు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రమేష్

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

కాకినాడ క్రైం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియమ, నిబంధనలపై కాకినాడ ట్రాఫిక్ పోలీసులు వాహనచోదకులకు కల్పించారు. ట్రాఫిక్-1 సీఐ ఎన్.రమేష్ ఆధ్వర్యంలో గురువారం కల్పనా సెంటర్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు కలిగిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం జారీ చేసిన నెంబర్ ప్లేట్లను మాత్రమే వాడాలన్నారు. వాహనచోదకులు హెల్మెట్ ధారణ వలన ఆయా కుటుంబాలు సురక్షితంగా, భరోసాగా ఉంటాయన్నారు. ర్యాష్ డ్రైవింగ్‌తో కూడిన నిర్లక్ష్యం తగదన్నారు. ముఖ్యంగా సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయడం ప్రాణాలకు హాని కలుగుతుందని... అటువంటి వారిపై కేసులు నమోదు చేసి భారీగా జరిమానా విధిస్తామన్నారు. త్రీటౌన్ లా అండ్ ఆర్డర్ సీఐ కేవీ సత్యనారాయణ, ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం: మాజీ ఎంపీ గీత

పిఠాపురం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తామని కాకినాడ మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కల్యాణ మండపంలో గురువారం జరిగిన వైసీపీ పట్టణ శాఖ సమావేశంలో ఆమె మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





రవీంద్రపురంలో నిలిచిపోయిన ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం. ఉప్పాడ కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

ఎన్నాళ్లిలా!

నత్తనడకన రవీంద్రపురం ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణ పనులు

ఇక్కడి విద్యార్థులకు ఉప్పాడ కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో తరగతులు

పంపేందుకు భయపడుతున్న తల్లిదండ్రులు

కొత్తపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రవీంద్రపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పరాయిపంచన చదువులు కొనసాగిస్తున్నారు. ఈ స్కూలు భవనం శిథిలావస్థకు చేరింది. కొత్త భవనం నిర్మాణానికి గత వైసీపీ ప్రభుత్వంలో 'నాడు-నేడు' ఫేజ్-2లో నిధులు మంజూరయ్యాయి. అయితే పలువురి ఉదాసీనత కారణంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా వుంది. గతంలో రవీంద్రపురం పాఠశాల శిథిలస్థితిలో వుండగా మరమ్మతులకు రూ.3లక్షలు గ్రాంటు ఇచ్చారు. అయితే రిపేర్లు వద్దని కొత్త భవనం నిర్మించాలంటూ గ్రామస్థులు, తల్లిదండ్రులు కోరారు. దీంతో కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల సహకారంతో భవనం నిర్మాణం చేపట్టారు. అయితే ఇది శ్లాబ్ దశలో నిలిచిపోయింది. ఇక్కడి విద్యార్థులను మెయిన్‌రోడ్డులో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పంపించారు. ఒక గదిలో ఒకపక్క 1, 2 3, తరగతులు, అదే గదిలో మరోపక్క 4, 5 తరగతులు నిర్వహిస్తున్నారు. అంతేగాక పాత పాఠశాల పరిసర ప్రాంతాల్లోని చిన్నారులను మెయిన్‌రోడ్డు మీదుగా స్కూలుకు పంపడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారు. పాఠశాల భవనం పూర్తి కాకపోవడంతో అనంతలక్ష్మి కాలనీ, రవీంద్రపురం నుంచి ఒకటో తరగతిలో చేరికలు తగ్గాయని ఉపాధ్యాయులు చెప్తున్నారు. నూతన భవనాన్ని త్వరగా పూర్తిచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ ప్రశాంతశ్రీ

సామాన్యులకు న్యాయం జరిగేలా

న్యాయ వ్యవస్థ

సర్పవరం జంక్షన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక హక్కులు, పౌరుల హక్కులను కాపాడటం, సమాజంలో సామాన్యులకు న్యాయం జరిగేలా న్యాయ వ్యవస్థ ఏర్పాటైందని తిమ్మాపురంలోని అక్నూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్ ప్రిన్సిపాల్ ఎస్.ప్రశాంతశ్రీ పేర్కొన్నారు. అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం పీజీ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ న్యాయం అనే పదం అర్థవంతంగా ఉండేందుకు ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమన్నారు. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, న్యాయ వ్యవస్థ పనితీరు, పౌరుల హక్కులపై ప్రముఖ సీనియర్ అడ్వకేట్ డాక్టర్ వై.వసంత అవగాహన కల్పించారు. డాక్టర్ మధుకుమార్, నదీమ్, మనోజ్ దేవా తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు, వయోవృద్ధుల సంక్షేమంపై కళాజాత

పెద్దాపురం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు, వయో వృద్ధుల సంక్షేమంపై గురువారం దర్గా సెంటర్, పాత బస్టాండు వద్ద వీర్నాల కృష్ణ వీధి నాటక బృందం కళాజాత నిర్వహించింది. వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆషాఢ దేవతాదర్శిని

ఒకేరోజు ఏడు క్షేత్రాల దర్శనకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆషాడంలో భక్తులకు ఆర్టీసీ బంపర్ ఆఫర్ ప్రకటించింది. జిల్లాలోని ఏడు ప్రధాన అమ్మవార్ల క్షేత్రాలను ఒక్కరోజే దర్శించేలా ప్రత్యేక బస్సులు ప్రారంభించినట్టు కాకినాడ డిపో మేనేజర్ మనోహర్ తెలియజేశారు. పెద్దాపురం మరిడమ్మ, కాండ్రకోట నూకాలమ్మ, చిన్న తిరుపతి శృంగారవల్లభస్వామి, తాటిపర్తి అపర్ణాదేవి, పి.మల్లవరం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, పిఠాపురం పురుహూతికా అమ్మవారు, మట్లపాలెం మహాలక్ష్మి దర్శనానికి కాకినాడ డిపో నుంచి గురువారం 'ఆషాఢ దేవతాదర్శిని' పేరిట ఒక యాత్రా స్పెషల్ బస్సు బయల్దేరింది. క్షేత్రాల దర్శనం అనంతరం రాత్రి తొమ్మిది గంటలకు కాకినాడ డిపోకి చేరుతుంది. కాకినాడ డిపో నుంచి పల్లె



కాకినాడ డిపో నుంచి బయల్దేరిన బస్సు

వెలుగు బస్సుకి రూ.350, ఎక్స్‌ప్రెస్ రూ.450. మీరు కోరిన దివ్య క్షేత్రాలకు ప్రత్యేక బస్సు కావాలంటే ఏర్పాటు చేస్తామని మేనేజర్ తెలిపారు. ఆసక్తి గలవారు 73829 10869 నెంబరును సంప్రదించాలని కోరారు.

పురుషోత్తపట్నమే దిక్కయ్యింది

టీడీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్వీఎస్ఎన్ వర్మ

కాకినాడ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు ఇచ్చిన పురుషోత్తపట్నం ప్రాజెక్టే మనకు దిక్కు అయ్యిందని టీడీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్వీఎస్ఎన్ వర్మ పేర్కొన్నారు. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన డీఆర్సీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏలేరులో ప్రస్తుతం 10 టీఎంసీల నీరే నిల్వ ఉందన్నారు. ఇందులో విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు పంపే నీటిని తీసేయగా వ్యవసాయానికి సరిపడా నీరు ఉండదన్నారు. అందువల్ల పురుషోత్తపట్నం ప్రాజెక్టు పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. ఇప్పటికే రెండు లక్షల క్యూబిక్ మీటర్ల నీరు సముద్రంలో కలిసిపోతోందన్నారు. గోదావరి నుంచి పంపులు ఆన్‌చేసి ఏలేరు ప్రాజెక్టులో నీటిని నింపాలన్నారు. పీబీసీ కింద కూడా కాలువ పనులు త్వరగా పూర్తి చేసి నీటి నిల్వలు పెంచి సరఫరా చేయాలన్నారు. గోదావరి ఆయకట్టు కింద



సమావేశంలో మాట్లాడుతున్న వర్మ

పంటకు నీరు విడుదల పూర్తికాలేదన్నారు. అన్నింటికంటే ముఖ్యంగా 2014-19 మధ్య అమలులో ఉన్న విధంగా దివిలి దగ్గర నుంచి వంతులవారీ రోజుల లెక్కింపు మొదలు కావాలన్నారు. ఏలేరు ప్రాజెక్టు నుంచి దివిలికి నీటి ప్రవాహం లెక్కింపులో లేదనే విషయం అధికారులు దృష్టిలో ఉంచుకోవాలని వర్మ విజ్ఞప్తి చేశారు.



కూటమి ప్రభుత్వానికి పంపిన కృతజ్ఞతల లేఖలను చూపిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

పొట్టి శ్రీరాములు స్మృతి వనానికి స్థలం కేటాయింపుపై హర్షం

కాకినాడ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం, స్మృతి వనం ఏర్పాటుకు 7.5 ఎకరాల స్థలాన్ని కూటమి ప్రభుత్వం కేటాయించడంపై కాకినాడ నగర ఆర్యవైశ్య సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సినిమా రోడ్డులోని వైఎంవీఏ హాలులో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ది యంగ్మెన్స్ వైశ్య అసోసియేషన్ అధ్యక్షుడు చెక్కా ప్రకాష్ మాట్లాడుతూ స్థలం కేటాయింపునకు కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్టు అధ్యక్షుడు దూండీ రాకేష్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబులకు కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శులు బచ్చు కామందు, గ్రంధి వీఎన్ నీల్, పీఆర్వో అద్దేపల్లి గంగరాజు, నాయకులు పాబోలు పున్నయ్య, పులవర్తి సుమంత్ పాల్గొన్నారు.

'పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరచాలి'

గొల్లప్రోలు రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగుపడాలని జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ ఆదేశించారు. గురువారం ఆయన గొల్లప్రోలు మండలం చెందుర్తి, దుర్గాడ గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య పనులు, తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్‌లను తనిఖీ చేశారు. గ్రామాల్లో అదనంగా ట్రై సైకిల్స్ తీసుకోవాలని సూచించారు. ఐవీఆర్ఎస్ కాల్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడా నీరు నిలవకుండా చూడాలని కోరారు. డీపీవో వెంట



దుర్గాడలో పారిశుధ్య పనులను తనిఖీ చేస్తున్న డీపీవో రవికుమార్

డిప్యూటీ ఎంపీడీవో కుమార్ వున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట విద్యుత్ సబ్ స్టేషన్ వార్షిక మరమ్మతులో భాగంగా విద్యుత్ స్తంభాల మార్పులు, తీగలు ఏర్పాట్లు తదితర పనుల నిర్వహణ దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ పెద్దాపురం ఈఈ ఏవీఎస్డీఎస్ ప్రభాకర్ ఆదివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. పాత ఎమ్మార్వో కార్యాలయ ఫీడర్, కొత్తపేట, చిన్నవీధి, కోటపేట, ఇస్మాయిల్‌నగర్, మెహెర్ కాంప్లెక్స్, వీర్రాఘవపురం, నీలమ్మ చెర్వు ప్రాంతం, ఇందిరా కాలనీ, పెన్షన్‌లైన్, 11కేవీఏ ఇండస్ట్రియల్ ఫీడర్, ఈటీసీ, వీబీఆర్ఐ ఫీడర్లు, అన్నపూర్ణమ్మ ఆలయ ఫీడరు, స్వామి అయ్యప్ప గుడి ప్రాంతం, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఈటీసీ కేంద్రం, బ్రౌన్‌పేట, వ్యవసాయ పరిశోధనా కేంద్రం, గణేష్ కాలనీ, సీతారామ కాలనీ, నూదిగుడి, యానాదుల కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ పెద్దాపురం ఈఈ ప్రభాకర్ తెలిపారు. సబ్ స్టేషన్ 11కేవీ దత్తాత్రేయ ఫీడర్‌పై గల లైన్ల మరమ్మతుల నిమిత్తం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, చాకలిపేట, సూరవరపు వారి వీధి, సాయిబాబా గుడి, చర్చి సెంటర్, ఎస్‌బీఐ సెంటర్, మెయిన్‌రోడ్డు, కోటగుమ్మం, ఉప్పాడ సెంటర్, మిరపకాయల వీధి, అంబేడ్కర్ సెంటర్, పాత బస్టాండు, షిష్టి కరణాల వీధి, రాజుగారి కోట, ఇందిరానగర్, రైల్వేస్టేషన్, స్టువర్టుపేట, రాపర్తి రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

నరసింహారావు నేత్రాల దానం



తాళ్లరేవు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి కాటాడి నరసింహారావు గురువారం ఆకస్మికంగా మృతి చెందారు. సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యుల అంగీకారంతో నరసింహారావు నేత్రాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు దానం చేశారు. సిబ్బంది కార్నియాలను సేకరించి వెంట తీసుకువెళ్లారు. నేత్రదానానికి సహకరించిన కుటుంబీకులను పలువురు అభినందించారు.



నాగులాపల్లిలో నేత్ర వైద్య శిబిరం

కొత్తపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులాపల్లి రైతు క్లబ్‌లో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సర్పంచ్ వడిశెట్టి గౌరీరాజేశ్వరీనారాయణరెడ్డి ప్రారంభించారు. రాజమహేంద్రవరం గౌతమి నేత్రాలయం అనుబంధమైన జగ్గంపేట వైద్య నిపుణులు 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 15 మందిని ఆపరేషన్ కోసం ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

సీనియారిటీ లిస్టుపై అభ్యంతరాలకు నోటిఫికేషన్ విడుదల

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థలో పనిచేస్తున్న సూపరింటెండెంట్ల సీనియారిటీ లిస్టుపై అభ్యంతరాలకు నోటిఫికేషన్‌ను కమిషనరు భావన విడుదల చేశారు. మేనేజర్ కర్రి సత్యనారాయణ ఉద్యోగ విరమణతో ఆ సీటు భర్తీ చేసే విషయంలో సీనియర్ లిస్టు విడుదల చేయవలసి వచ్చింది. ప్రయారిటీ ప్రకారం సీనియర్ లిస్టులో జి.దుర్గారావు (ఇంజనీరింగ్ సెక్షన్ సూపరింటెండెంట్), ఎంబీఎన్ జయరాం (హెల్త్ సెక్షన్ సూపరింటెండెంట్), ఎంవీ రామశాస్త్రి ఇన్చార్జి అకౌంటెంట్, ఎస్.సీతారాం ఇన్చార్జి మేనేజరు, కె.సతీష్ బాబు యూపీఏ సెక్షన్ సూపరిం టెండెంట్, టౌన్ ప్లానింగ్ ఇన్చార్జి సూపరింటెండెంట్, కేఎస్ ప్రకాష్, రెవెన్యూ సెక్షన్ సూపరింటెండెంట్, కె.వరప్రసాద్ కౌన్సిల్ విభాగం సూపరింటెండెంట్, ఈ లిస్టు ప్రకారం వీరిలో ఒకరికి ప్రమోషన్ కల్పించడం ద్వారా సూపరింటెండెంట్ స్థాయి నుంచి జూనియర్ అసిస్టెంట్ స్థాయి వరకు పలువురికి ఉద్యోగోన్నతులు రానున్నాయి.

ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాలి

జడ్పీ సీఈవో లక్ష్మణరావు

కరప, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేలా ప్రజలను చైతన్యపరచాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, పంచాయతీ అధికారులు, సిబ్బంది ఆ దిశగా కృషి చేసి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని జడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు సూచించారు. గురువారం ఆయన పెద్దాపురప్పాడులో ఇంటింటా చెత్త సేకరణ, తడిచెత్త, పొడిచెత్త విభజన తదితర అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. డిప్యూటీ ఎంపీడీవో సలాది శ్రీనివాసరావు, కార్యదర్శి పినిశెట్టి వీరభద్రరావు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గజ్జనపూడిలో 5వేల మందికి అన్నదానం

ప్రత్తిపాడు, జూలై 17 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గజ్జనపూడి గ్రామంలోని సాయిబాబా ఆలయం వద్ద గురువారం అన్నదానం నిర్వహించారు. గురుపౌర్ణమి ముగింపు ఉత్సవాలు పురస్కరించుకుని నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమంలో 5వేల మంది భక్తులు పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. గ్రామస్తులు, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

గిరిజన గ్రామాల్లో దాహం కేకలు



తాగునీటి కోసం రోడెక్కిన లక్కవరం గ్రామస్తులు

మోతుగూడెం, జూలై 17(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం చదలవాడ పంచాయతీ లక్కవరంలో ఆదివాసులకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు గ్రామాల్లో తీసుకోవాల్సిన చర్యల్లో అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత్యంతరం లేక కాలువల చలమ నీటిపై ఆధారపడుతున్నారు. ఏజెన్సీ గ్రామాలు రకాల స్కీం ద్వారా నిర్మించిన ఓవర్ అండ్ ట్యాంకులతో మంచినీటి సరఫరా పూర్తిస్థాయిలో జరగడం లేదు. ఈ గ్రామం లక్కవరం వాటర్ ట్యాంకుకు సంబంధించిన మోటార్లు మరమ్మతుకు గురవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. లక్కవరంలో బోరు పంపు కూడా పనిచేయడం లేదు. దీనిపై అధికారులు విన్నవించినా పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం లక్కవరం గ్రామస్తులు మంచినీటి కోసం రోడ్డుమీదకు వచ్చి ధర్నా చేశారు. అనంతరం సచివాలయం దగ్గర కూడా వెళ్లి డీవిజల్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

మహిళ మృతికి కారకులను శిక్షించాలి

ఐటీడీఏను ముట్టడించిన ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు

రంపచోడవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో ఇటీవల ఆదివాసీ మహిళా(పార్వతి) మృతికి కారకులైన వైద్యులను శిక్షించాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం ఐటీడీఏను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తీగల బాబురావు మాట్లాడుతూ ఆదివాసీ మహిళ ప్రసవించి మృతిచెందిన విషయాన్ని గోప్యంగా ఉంచడం వైద్యుల నిర్లక్ష్యమేనన్నారు. వైద్యుల నిర్లక్ష్యంపై ఆదివాసీలు ప్రశ్నించకపోతే ప్రాణాలకు రక్షణ ఉండదని, ఈనెల 21న ఐటీడీఏ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. డివిజన్అధ్యక్షుడు మోడిద నూకరాజు, కోఆర్డినేటర్ పీతప్రసాద్, కడబాల శ్రీను బాబు, చిలకల గుణేశ్వరరావు, చిన్నారావు, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన గీత



రంపచోడవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): అర కు మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొ త్తపల్లి గీత గురువారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అరకు పార్లమెంట్ పరిధిలోని పలు సమస్యలను మంత్రికి విన్నవించారు.

బోర్నగూడెంలో 'సుపరిపాలనలో తొలిఅడుగు '

రంపచోడవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): బోర్నగూడెంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ఆధ్వర్యంలో గురువారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబురమేష్, మండలాధ్యక్షుడు కారం సురేష్‌బాబు, అడబాల బాపిరాజు పాల్గొన్నారు.

'25న ధర్నాను జయప్రదం చేయాలి'

రంపచోడవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలు నిరసిస్తూ ఈనెల 25న విజయవాడలో జరిగే ధర్నా, ప్రదర్శనలను జయప్రదం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గౌరవఅధ్యక్షుడు ఐవీ రమణ పిలుపునిచ్చారు. మార్క్స్-ఎంగిల్స్ భవనంలో పీడీఎస్‌యూ డివిజన్‌కార్యవర్గం ఆధ్వర్యంలో 'చలో విజయవాడ-చలో అమరావతి' గోడపత్రికను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యారంగసమస్యలు పరిష్కరించాలన్నారు. పీడీఎస్‌యూ నాయకులు నాగరాజు, మావోరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వివేకానంద, అవినాష్‌దొర, కె.సాయిదుర్గ, ఎం.ప్రశాంత్ పాల్గొన్నారు.

యల్లవరం సొసైటీ చైర్మన్‌గా హరిబాబు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న బుర్లె హరిబాబు

అడ్డతీగల,జూలై 17(ఆంధ్రజ్యోతి): యల్లవరం కోపరేటివ్ సొసైటీ చైర్మ న్‌గా బుర్లె హరిబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, అడ్డతీగల వాసవీ క్లబ్ నేతలు పూలమాలలు వేసి దుశ్శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా చైర్మన్ హరిబాబు మాట్లాడుతూ రైతులకు సేవ చేసే భాగ్యం తమకు అప్పగించిన ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, తెలుగు యువత అధ్యక్షుడు బాస్కర్‌కు ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ మాజీ అధ్యక్షుడు యడ్ల శ్రీనివాస్, బీజేపీ నేత స్వప్న కుమారి, జనసేన నేతలు జయరామ్,సాయి, వాసవీక్లబ్ అధ్యక్షుడు కాళ్లకామరాజు పాల్గొన్నారు.

ఆషాఢ మాసం అమ్మవారి సారె



అమ్మవారికి ఆషాఢ మాసం సారె తీసుకెళ్తున్న భక్తులు

చింతూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం అమ్మవారి సారె కార్యక్రమం గురువారం చింతూరు మండలం ఎర్రంపేటలో భక్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు సామూహికంగా చింతూరు నుంచి ఎర్రంపేటలోని అమ్మవారి ఆలయంవద్దకు సారెతో ఊరేగింపుగా చేరుకుని అమ్మవారికి సమర్పించారు. సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో జిల్లా మహిళా కన్వీనర్ సవలం పద్మావతి, మండల మహిళా కన్వీనర్ అల్లి కృష్ణవేణి, ఉప కన్వీనర్ ఎర్ర రమాదేవి, గ్రామ కన్వీనర్ సరోజిని, సుభాషిణి పాల్గొన్నారు.

కోపరేటివ్ చైర్మన్‌గా చంద్రయ్య బాధ్యతల స్వీకరణ



వీఆర్‌పురం, జూలై 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ కోపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు గొంది చంద్రయ్య గురువారం రేఖపల్లిలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ మాట్లాడుతూ తన మీద నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవికి, డివిజన్ తెలుగు యువత అధ్యక్షుడు మఠం భాస్కర్‌కు కృతజ్ఞత లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు వాళ్ల రంగారెడ్డి, మాజీ జడ్పీటీసీ ముత్యాల రామారావు, నాయకులు బొర్ర నరసింహారావు, జంగాల మల్లిఖార్జున్, బీరక సూర్యప్రకాష్‌రావు, బొర్ర ఆదినారాయణ, మామిడి రాజు, బొర్ర వాసు, పొడియం రాజు, పాయం లక్ష్మణరావు, ముత్యాల శంకర్‌రావు, చక్రపాణి పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

కిక్కిరిసిన బస్సులతో విద్యార్థుల ఇక్కట్లు

● బస్సుల కొరత● పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



రద్దీతో బస్సు ఎక్కేందుకు ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

ప్రత్తిపాడు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): బస్సు సర్వీసుల కొరత కారణంగా ప్రత్తిపాడు ప్రాంతంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం కళాశాలలు, ఇతర విద్యాసంస్థలకు వెళ్లే సమయం, సాయంత్రం ఆయా విద్యాసంస్థల నుంచి బయటకు వచ్చే సమయాల్లో ఆర్టీసీ బస్సులు తగినన్ని లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం, సాయంత్రం ఇళ్ల నుంచి విద్యాసంస్థలకు రాకపోకల సమయంలో కిక్కిరిసిన బస్సులతో వేలాడుతూ ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలకుగురై గాయాలు పాలవుతున్నారు. ఈ దుస్థితి ధర్మవరం, ప్రత్తిపాడు, రాచపల్లి, కిర్లంపూడి, తదితరచోట్ల అధికంగా ఉంటుంది. విద్యార్థుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు ఉదయం సాయంత్రం ప్రత్యేక బస్సులు నడపాలని విద్యార్థులు,వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

సంజీవయ్య నగర్ కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం

జగ్గంపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గోకవరం సంజీవయ్య నగర్ కాలనీలో గోకవరం టౌన్ టీడీపీ ప్రధాన కార్యదర్శి గున్నార్ లాజర్ ఆధ్వర్యంలో టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు ముందుగా లాజర్ సూర్యకుమారి దంపతులు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే చేతులమీదుగా ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ చేశారు. సంజీవయ్యనగర్ కాలనీలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగువారి ఆరాధ్య దైవం విశ్వ విఖ్యాత నట సార్వభౌముడు నందమూరి విగ్రహాన్ని గున్నార్ లాజర్ సంజీవయ్యనగర్‌లో ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, అడపా భరత్, గాజింగం సత్తిబాబు, ఉంగరాల రాము, పాలూరి బోసుబాబు,దాసరి సీతారామకృష్ణ, మంగరౌతు రామకృష్ణ, పిల్లా చంటిబాబు, చింతల రవికాంత్, ఎస్.బాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రత్తిపాడు, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలంలో ఏలూరు, శాంతి ఆశ్రమం 11కేవీ ఫీడర్‌పై శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు జగ్గంపేట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీరభద్రరావు తెలిపారు. ఈ రెండు ఫీడర్ల పరిధిలోని విద్యుత్ లైన్లుమరమ్మత్తులు, చెట్ల కొమ్మల తొలగింపు పనులు నిమిత్తం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ తెలిపారు. ఏలూరు, టి.రాయవరం, వెంకట్ నగరం, యుజేపురం,వాకపల్లి, పోతులూరు గ్రామాలకు ఈ విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గండేపల్లి: మండలంలో గండేపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గండేపల్లి, ఎన్టీరాజాపురం, కే గోపాలపురం, నీలాద్రిరావుపేట, జెడ్.రాగంపేట గ్రామాలకు శుక్రవారం ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈడి వీరభద్రరావు, గండేపల్లి ఏఈ కిరణ్ కిషోర్ తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మత్తు పనుల్లో భగంగా నిలిపివేయడం జరుగుతుందని వినియోగాదారులు సహకరించాలని కోరారు.

జగ్గంపేట: శుక్రవారం 11కేవీ కాట్రావులపల్లి ఫీడర్ నందు,చెట్లు నరికివేత, మరమ్మత్తులు కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడుతుందని విద్యుత్ ఏఈ వీరభద్రరావు తెలిపారు. సీతానగరం, కాట్రావులపల్లి గ్రామాలకు బోరులకు విద్యుత్ సరఫరా నిలుపుదల అవుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రాథమిక సొసైటీల అభివృద్ధికి కృషి చేయండి

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్



చైర్మన్ కంటిపూడి సత్యనారాయణను అభినందిస్తున్న నవీన్

గండేపల్లి, జూలై 17(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎంపికైన సొసైటీ చైర్మన్లు ప్రాథమిక సొసైటీల అభివృద్ధికి కృషిచేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలో గండేపల్లిలో ప్రాథమిక సహకార సంఘం నూతన చైర్మన్‌గా ఎన్నికైన ఎన్టీరాజాపురంనకు చెందిన కంటిపూడి సత్యనారాయణ ప్రమాణస్వీకార వేడుకకు ముఖ్యఅతిథిగా జిల్లా టీడీపీ అధ్యక్షుడు నవీన్ హాజరయ్యారు. ముందుగా చైర్మన్ సత్యనారాయణతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ రైతులు ఎక్కువగా ప్రాథమిక సొసైటీల పైనే ఆధారపడి వ్యవసాయాలు చేస్తుంటారని వారికి సొసైటీల ద్వారా కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పించడంతోపాటు పెట్టుబడులకు రుణాలు అందేలా చూడాలన్నారు. చైర్మన్ కంటిపూడి సత్యనారాయణ మాట్లాడుతూ తమపై నమ్మకంతో సొసైటీ అధ్యక్షుడిగా తమను ఎంపికచేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, నవీన్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ కార్యదర్శులు కోర్పు లచ్చయ్యదొ ర, ఎస్వీఎస్ అప్పలరాజు, మండల పార్టీ అధ్యక్షుడు పోతుల మోహనరావు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోర్పు సాయితేజ్, వైస్ ఎంపీపీ కుంచే రాజా, యువనాయకులు జాస్తి వసంత్, సొసైటీ చైర్మన్లు కందుల బాబ్జి, పాలకుర్తి ఆదినారాయణ, దిడ్డి శ్రీను, నాయకులు కందుల చిట్టిబాబు, సుంకవిల్లి రాజు, బొల్లంరెడ్డి రామకృష్ణ, వెలమాటి కాశీ, అడబాల భాస్కరరావు, కేతిన వెంకన్నచౌదరి, చాగంటి సత్యనారాయణ, యర్రంశెట్టి బాబ్జి, ఎ.అంజనేయులు, పి.భాస్కరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదిత్య చైర్మన్ శేషారెడ్డి

'ఆదిత్య'లో మొదటి సంవత్సరం పాలిటెక్నిక్ తరగతులు ప్రారంభం

గండేపల్లి, జూలై 17(ఆంధ్రజ్యోతి):మండలంలో సూరంపాలెం ఆదిత్య విద్యాప్రాంగణంలో గల ఆదిత్య గ్రూప్ ఆఫ్ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన ఈసీఈ, మెకానికల్, సీసీఎన్, సివిల్ బ్రాంచ్‌లకు చెందిన మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన విద్యార్థి తల్లిదండ్రుల సమావేశంలో ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ కర్తవ్యాన్ని, లక్ష్యాలను నిరంతరం గుర్తెరిగి మసలుకోవాలన్నారు. ఆదిత్యపై అపార నమ్మకంతో తమ చిన్నారులను తమ సంస్థలో చేర్పించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రత్తిపాడు, జూలై 17 (ఆంధ్రజ్యోతి):మండలంలోని లంపకలోవ జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం విద్యార్థులకు సైబర్ నేరాలు, మత్తు పదార్థాలపై పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి హెచ్ఎం డి.వాణిప్రభ అధ్యక్షత వహించారు. సమావేశంలో పాల్గొన్న ఎస్ఐ లక్ష్మీకాంతం మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్‌లలో వచ్చే మెసేజ్‌లు, లింకులు ఓపెన్‌చేసి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడవద్దన్నారు. మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని కోరారు. విద్యార్థులు తమ లక్ష్యాలసాధన కోసమే దృష్టి సారించాలని ఎస్ఐ కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ నివారించడానికి డ్రోన్స్‌తో నిఘా

జగ్గంపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట సర్కిల్ పరిధిలో పాఠశాలలు, కళాశాలలవద్ద ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ నివారించడానికి డ్రోన్స్‌తో నిఘా చర్యలు చేపట్టినట్లు సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు జగ్గంపేట సర్కిల్‌లోని అన్ని పాఠశాలలు, ప్రైవేట్ కళాశాలల వద్ద ప్రతిరోజు ఉదయం, సాయంత్రం సమయాల్లో డ్రోన్స్ పెట్రోలింగ్ ద్వారా అనుమానిత వ్యక్తులను గుర్తించడం, విద్యార్థిని విద్యార్థుల భద్రత పెంపొందించడమే లక్ష్యంగా శాంతి భద్రతల పర్యవేక్షణకు డ్రోన్స్‌ను వినియోగిస్తున్నామని తెలిపారు. గురువారం కిర్లంపూడి మండలం బూరుగుపూడి హై స్కూల్ వద్ద డ్రోన్‌లో నిఘా నిర్వహించారు.

గుడ్ అండ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన

గండేపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలం మురారి, గండేపల్లి హైస్కూల్ గురువారం జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులో మహిళలు బాలికలపై వేధింపులు, దాడులు, నేరాలు నివారణ, గుడ్ అండ్ బాడ్ టచ్ పై అవగాహన కల్పించారు.

రైతుల అభ్యున్నతికి కృషి: ఎమ్మెల్యే సత్యప్రభ



తిమ్మరాజు చెరువు నుంచి సాగునీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సత్య ప్రభ

ఏలేశ్వరం, జూలై 17(ఆంధ్రజ్యోతి):రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. గురువారం సి.రాయవరంలో 6వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే తిమ్మరాజు చెరువు నుంచి దిగువ పంట కాలువలకు 25క్యూసెక్కుల నీటిని విడుదల చేశారన్నారు. ఇప్పటికే కాలువల్లో పూడిక తీత పనులు పూర్తయ్యాయని, రైతులకు సాగు నీరు సక్రమంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఏలేశ్వరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఏడాది సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలి అడుగుకు విశేష స్పందన లభిస్తోందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. గురువారం పట్టణంలో 16,19 వార్డుల్లో ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు మూది నారాయణస్వామి, కౌన్సిలర్లు అలమడ చలమయ్య, బొదిరెడ్డి గోపి, యండగుండి నాగబాబు, టీడీపీ నాయకులు వాగు రాజేష్, కోట్ల కృష్ణ, జ్యోతుల పెదబాబు, కోరాడ కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ దగ్ధం



తుని రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): తుని పట్టణంలోని గవరపేట శివాలయం సమీపంలో కొబ్బరితోట వీధి ఎంట్రన్స్ లక్ష్మీనారాయణ ఆలయం వద్ద శరకణం లక్ష్మణరావుకు చెందిన ఎలక్ట్రికల్ బైక్ గురువారం రాత్రి దగ్ధమైంది. ఒక్కసారిగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. చార్జింగ్ సమయంలో ఈ ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన చోట గ్యాస్ సిలిండర్లు ఉన్నా ఎటువంటి ప్రమాదం జరగలేదు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా వరహాలుబాబు

శంఖవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా నెల్లిపూడి గ్రామానికి చెందిన అదట్రా వరహాలుబాబు నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం బీజేపీ మాజీ ఇన్‌చార్జి గంటా బాలుదొర నివాసంలో పార్టీ శ్రేణులు నూతన అధ్యక్షుడు వరహాలుబాబుకి అభినందనలు తెలియజేశారు. కామర్సు చిరంజీవి, అదట్రా వెంకన్నదొర, బొమ్మిడి లోవరాజు, మునశాల రాజు, జంగం శివశంకర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోటనందూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): కోటనందూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 33కేవీ, 11కేవీ భీమవరపుకోట విద్యుత్ లైన్లు మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 8నుంచి ఒంటిగంటవరకు సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఏఈ రామకృష్ణ తెలిపారు. జగన్నాథపురం, భీమవరపుకోట, అప్పలరాజుపేట, ఎస్.ఆర్.పేట, బిళ్లనందూరుగ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

కొనసాగిన వేలం పాటలు

తొండంగి, జూలై 17(ఆంధ్రజ్యోతి): శ్రీసంస్థానం సత్రం భూముల వేలం పాటలు గురువారం నాల్గవ రోజు కూడా కొనసాగాయి. 65.62 ఎకరాల భూమలను 30బిట్లుగా విభజించి వేలం నిర్వహించారు. గతంలో 5,75,500 శిస్తు రాగా ఈఏడాది రూ.6,02,550 వచ్చింది. గతం కంటే రూ.36,500 ఎక్కువ వచ్చింది.

పేదల జీవితాల్లో ఆనందం నింపడమే లక్ష్యం



తునిలో ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య



రౌతులపూడి: ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

కోటనందూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): పేదల కుటుంబాల్లో ఆనందం నింపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. గురువారం బొద్దవరం, టి.జె.నగరం గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుందన్నారు. తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది విద్యార్థులుంటే అంతమందికి తల్లుల ఖాతాలో నగదు వేసి ఆదుకున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు యనమల రాజేష్, గాడి రాజుబాబు సుర్ల లోవరాజు, మార్కెట్ కమిటీ చైర్మెన్ అంకంరెడ్డి రమేష్, పెంటకోట భాస్కరసత్యనారాయణ, వెలగా వెంకటకృష్ణారావు, రుత్తల శ్రీనివాస్, గెడ్డం కొండయ్య నాయుడు, సుర్ల అప్పలనాయుడు, షేక్ నవాబ్‌జానీ, వాసం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనలో తొలి అడుగు

తుని రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తుని పట్టాణాభివృద్ధికి బృహత్తర పథకాలకు కార్యరూపం ఇస్తామని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం తుని పట్టణంలో పలు వార్డుల్లో గురువారం మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు, సీనియర్ నేత యనమల రాజేష్‌తో కలిసి పర్యటించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కుచ్చర్లపాటి రూపాదేవి ప్రాతినిధ్యం వహిస్తున్న బ్యాంక్ కాలనీలో టౌన్ సీనియర్ నేతలు ఇనుగంటి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణి సత్యనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, మోతుకూరి వెంకటేష్, మల్ల గణేష్, పరవాడ తాతబాబులతో కలిసి ఇంటింటికి వెళ్లిన ఎమ్మెల్యే యనమల దివ్య ప్రభుత్వ పథకాలు వివరిస్తూ ప్రజలకు కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో చింతంనీడ అబ్బాయి, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్ కోడా వెంకటరమణ, దంతులూరి శ్రీనివాసరాజు, పల్లెల నాగేశ్వరావు, జల్లు వాసు, సిద్ధాంతపు సత్తిబాబు, అల్లు రాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం

రౌతులపూడి, జూలై 17(ఆంధ్రజ్యోతి): బంగారయ్యపేటలో గురువారం ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు ఆధ్వర్యంలో స్థానిక నేత గుం డ్రాజుతో కలిసి సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఏడాది కాలంలో ప్రత్తిపాడులో చేసిన అభివృద్ధిని వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకుని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పసగడుగుల రమణ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పటిష్టతకు కలిసికట్టుగా పనిచేయాలి



టీడీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే దివ్య

తుని రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): పార్టీ పటిష్టతకు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే యనమల దివ్య కోరారు. తుని మండలం వల్లూరు గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి తేటగుంట టీడీపీ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే దివ్య సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి పార్టీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్ పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో కుర్ర ప్రకాష్‌రావు, సత్తిబాబు, నాగేశ్వరరావు, రమణ, రాజా, కొత్తూరు సత్యనారాయణ, పామర్తి వెంకట్రావు, రేలంగి జోగారావు, గంగిశెట్టి రాము, చంటిబాబు తో పాటు 100మంది వైసీపీ కార్యకర్తలు ఉన్నారు. వీరిని టీడీపీ మండల అధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి, కుర్ర వెంకటరమణతో పాటు పలువురు నాయకులు అభినందించారు.

గిరిజన గ్రామాలకు బస్సును పునరుద్ధరించండి



శంఖవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): శంఖవరం నుంచి గిరిజన గ్రామాలకు వెళ్లే పెదమల్లాపురం బస్సు సర్వీసును పునరుద్ధరించాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ కోరారు. ఈమేరకు ఆర్టీసీ అధికారులకు వినతి పత్రం అందించారు. గతంలో ఈమార్గంలో ఉండే బస్సును రహదారి పరిస్థితుల దృష్ట్యా రద్దు చేశారని, కూటమి ప్రభుత్వం వచ్చాక విశాలమైన రహదారి నిర్మాణం జరిగిందని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరారు. రంబాల వెంకటేశ్వరరావు, బొలిశెట్టి రామకృష్ణ, పెండెం బాబ్జీ, సలాది నాయుడు పాల్గొన్నారు.